9440662699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015

రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 3 సంచిక 5, పేజీలు 4 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 23 - ఆదివారం 29 అక్టోబర్ - 2017

వ్యవసాయంపైనే దృష్టి

పెట్టుబడిదారులకు సీఎం పిలుపు

రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా ఓ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగాసీడ్ పార్కులో భాగస్వామిగా ఉండే అంశాన్ని పరిశీలిస్తామని ప్రపంచ ప్రఖ్యాత విత్తన సంస్థ పయనీర్ హామీ ఇచ్చింది. సీఎం చంద్రబాబు తన అమెరికా పర్యటనలో భాగంగా ఐయోవాలోని పయనీర్ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరణల విభాగాన్ని సందర్శించారు. పయనీర్ గ్లోబల్ ఉపాధ్యక్షుడు బ్రాడ్ లాన్స్‌తో భేటీ అయ్యారు. ఆ సంస్థకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో స్వయంగా హార్వెస్టర్‌ను నడిపారు. 90 ఏళ్ల అనుభవం,90 దేశాల్లో ప్రామాణిక విత్తనాల ఉత్పత్తి, మార్కెటింగ్‌లో ప్రాచుర్యం గడించిన పయనీర్ సంస్థను మెగా సీడ్ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉండాలని చంద్రబాబు ఆహ్వానించారు. ఐయోవా విశ్వవిద్యాలయ సహకారంతో చేపడుతున్న మెగా సీడ్‌పార్కును ఏపీ దశ, దిశను మార్చేలా తీర్చిదిద్దుతామన్నారు. పయనీర్ సంస్థ పరిశోధనశాలను సందర్శించారు. మొక్క జన్యుకణంలోని అనువంశిక పదార్థాన్ని విశ్లేషించే విధానం, జన్యువులను సవరించే పద్ధతులను అక్కడి శాస్త్రవేత్తలు సీఎం బృందానికి వివరించారు. ఐయోవాలో అమెరికా – భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరం రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం మాట్లాడారు. సాగును లాభసాటిగా తీర్చిదిద్దేందుకు వ్యవసాయరంగంలో వినూత్న మార్పులు తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భూసార పరీక్షలు చేయించి, ఏ ప్రాంతానికి ఏ పంట వేయాలో రైతులకు కచ్చితమైన మార్గదర్శనం చేస్తామన్నారు. దీనికి మిలిందా గేట్స్ ఫౌండేషన్ సహకారంఅందించేందుకు ముందుకొచ్చిందన్నారు. వచ్చే నెలలో విశాఖలో నిర్వహించే రాష్ట్ర స్మార్ట్ ల్యాండ్ హోల్డర్స్ సదస్సుకు బిల్ గేట్స్, మిలిందా గేట్స్ హాజరుకానున్నారని తెలిపారు. ఏపీలో భూసార పరీక్షలతో విశ్లేషణ, వివరాల పట్టికల తయారీకి గేట్స్ ఫౌండేషన్ సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు.

రాష్ట్రానికి రండి..
వారి సంతోషాన్ని చూడండి

భారత్‌లో వ్యాపార అనుకూలత కలిగిన రాష్ట్రాల్లో ఏపీకి ప్రపంచ బ్యాంకు నంబర్ వన్ ర్యాంక్ ఇచ్చిందని చంద్రబాబు తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టినవారు ఎంత సంతోషంగా ఉన్నారో తెలుసుకునేందుకు ఒక్కసారి రాష్ట్రంలో పర్యటించాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.పారదర్శక పాలన కోసం ఫైళ్లను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్లో పెట్టామని, సాంకేతికతను మేళవించి రియల్‌టైం పాలనను అందిస్తున్నామన్నారు. ప్రపంచంలో తానెక్కడ ఉన్నా సీఎం కోర్ డాష్‌బోర్డు ద్వారా తమ రాష్ట్రంలోని అన్ని శాఖల, అన్ని రంగాల కార్యకలాపాలను

- మిగతా 2 లో

రండి ఇబ్బందేముంది !

మినహాయింపుపై సోమవారం తీర్పు

హైదరాబాద్: 'ప్రజల కోసం పాదయాత్ర చేస్తున్నా ప్రతి శుక్రవారం జరిగే కోర్టు విచారణలో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వండి'. అని కోరిన విపక్షనేత వైఎస్ జగన్‌కు సీబీఐ కోర్టు నుంచి ఊహించని ప్రశ్నలు ఎదురయ్యాయి."చట్టాలు, కోర్టులంటే గౌరవమున్న వ్యక్తిగా, బాధ్యతాయుతమైన పౌరుడిగా ప్రతి శుక్రవారం కోర్టు విచారణకు హాజరై, మిగిలిన రోజుల్లో పాదయాత్ర చేసుకోవచ్చు కదా!" అని ప్రశ్నించింది. నవంబర్ 2 నుంచి మే 2వ తేదీ వరకు ఆరు నెలల పాటు మూడువేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తున్నానని...ప్రతి శుక్రవారం తన వ్యక్తిగత హాజరునకు మినహాయింపు ఇవ్వాలని జగన్ దాఖలు చేసుకున్న పిటీషన్ పై సీబీఐ కోర్టు న్యాయమూర్తి విచారణ జరిపారు." ఐదు రోజులు పాద యాత్ర చేసి... శుక్రవారం కోర్టుకు వస్తే విచారణకు హాజరైనట్టు ఉంటుంది.! కొంత విశ్రాంతి కూడా తీసుకున్నట్లవుతుంది. ప్రకృతి సహకరించకపోతే పాదయాత్రకు ఎలాగూ విరామం ఇస్తారు కదా! అలాగే ప్రతి శుక్రవారం కోర్టు విచారణకు హాజరై మిగిలిన రోజుల్లో పాదయాత్ర చేసుకోవచ్చు కదా! అని న్యాయమూర్తి ప్రశ్నించారు. తద్వారా న్యాయస్థానాల మీదున్న గౌరవంతోనే తాను కోర్టు విచారణకు హజరవుతున్నానని ప్రజలకు కూడా తెలియచేవచ్చునని చెప్పారు. అయితే పాదయాత్రకు ప్రతి శుక్రవారం విరామం ఇస్తే అందులో 'తీవ్రత' (సీరియస్‌ను) పోతుందని జగన్ తరపు న్యాయవాది అశోక్ రెడ్డి పేర్కొన్నారు. 3 వేల కొలోమీటర్ల పాదయాత్రకు పూర్తిచేసే వరకూ తిరిగి ఇంటికి రాకుడదని నిర్ణయించుకున్నారని అందువల్ల ఆరు నెలలపాటు వ్యక్తిగత హాజరునకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ' జగన్‌పై తీవ్రమైన ఆర్థిక నేరానికి సంబంధించిన అభియోగాలు ఉన్నాయి. కానీ.. ఆయన పూర్తిస్థాయి రాజకీయ నాయకుడు. ఏపీలో ప్రజల సమస్యలపై పోరాడాల్సి ఉంది. అందువల్ల పాదయాత్ర నిరంతరం చేసేందుకు వీలుగా ఈ మినహాయింపు కోరుతున్నాం" అని న్యాయవాది తెలిపారు. ప్రతిపక్ష నేతగా ప్రజలు సాధకబాధలు, కష్టాలు తెలుసుకునేందుకే జగన్ ఈ యాత్ర ప్రారంభిస్తారని చెప్పారు. అదే సమయంలో ముందుగా అనుమతి కోరకుండా పాదయాత్రపై ప్రకటన చేసిన తర్వాత వ్యక్తిగత హాజరునకు మినహాయింపు కోరడం తమ విచారణకు ఆటంకం ఏమీ ఉండదని, జాప్యం జరిగే అవకాశం కూడా లేదని తెలిపారు... కోర్టు ఎటువంటి షరతులు విధించినా పాటించేందుకు సిద్ధంగా ఉన్నామని, న్యాయస్థానం ఆదేశించినప్పుడు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నామని జగన్ తరపు న్యాయవాది తెలిపారు.

పోలీస్ జీవితం సమాజానికి అంకితం

డీజీపీ నండూరి సాంబశివరావు

రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి : విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, డీజీపీ నండూరి సాంబశివరావు, సీపీ గౌతమ్ సవాంగ్, ఇతర ఉన్నతాధికారులు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ సాంబశివరావు మాట్లాడుతూ జీవితాన్ని సమాజానికి అంకితం చేసేవాడే పోలీస్ అన్నారు. సవాళ్లతోనే సహజీవనం చేస్తున్నామని, కుటుంబ క్షేమం కంటే సమాజ సంతోషమే ముఖ్యమని పోలీసులను కొనియాడారు. దేశ సమగ్రతకు సవాళ్లు విసురుతున్న మావోయిస్టులను సైతం మనం ధీటుగా ఎదుర్కొంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలీస్ సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

'తాజ్' మాటల తూటాలు 2లో
కాల్ మనీ వ్యాపారుల దౌర్జన్యం 4లో

రచ్చ రచ్చ...

- టీడీపీ భేటీ రసాభాస
- రేవంత్, మోత్కుపల్లి మాటల యుద్ధం
- రేవంత్ కాంగ్రెస్ గూటికేనా?

హైదరాబాద్ : తెలంగాణ తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం వాడివేడిగా సాగింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీనియర్ నాయకుడు మోత్కుపల్లి సర్సింహులు మధ్య తీవ్రవాగ్వివాదం చోటు చేసుకుంది. రాహుల్‌గాంధీని కలవాల్సిన అవసరం ఏముందని రేవంత్‌రెండ్డిని మోత్కుపల్లి నిలదీసినట్లు తెలిసింది. సమావేశం గరం గరంగా జరుగుతున్న క్రమంలోనే మోత్కుపల్లి సర్సింహులుతో పాటు పార్టీ అధికార ప్రతినిధి అరవింద్‌కుమార్‌గౌడ్ మధ్యలోనే వెళ్లిపోయారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీతో కలిశారు. లేదా అని రేవంత్‌ను మోత్కుపల్లి, అరవింద్‌కుమార్‌గౌడ్ నిలదీశారు. ఇరువురు అడిగిన ప్రశ్నకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహంతో ఊగిపోతూ వాకౌట్ చేశారు. పార్టీ అధినేత చంద్రబాబుకి సమాచారం ఇవ్వకుండా, చెప్పకుండా రాహుల్‌ను ఎలా కలుస్తారని మోత్కుపల్లి నిలదీశారు. ఏపీ మంత్రులు పరిటాల సునీత, యనమల రామకృష్ణుడుపై దురుసుగా మాట్లాడట మెందుకని ప్రశ్నించారు. దీంతో రసాభాసగా మారింది. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ రేవంత్‌రెడ్డి పొలిట్‌బ్యూరో సమావేశానికి హాజరయ్యారు. దీంతో ఆ పార్టీ నాయకులు, శ్రేణులు ఆశ్చర్యంలో మునిగిపోయారు. తెలుగుదేశం పార్టీకి రాంరాం చెప్పి కాంగ్రెస్ చేరతారన్న ప్రచారం జోరుగా జరిగిన క్రమంలో నాటి పొలిట్‌బ్యూరో సమావేశానికి రేవంత్‌రెడ్డి హాజరవుతారా లేదా అని పెద్ద ఎత్తున చర్చ జరిగింది. టీటీడీపీ నాయకత్వం సైతం రేవంత్ హాజరుపై సందేహాలు వ్యక్తం చేసింది. రెండు రోజుల పాటు ఢిల్లీలో మకాం వేసి రాహుల్‌గాంధీతో ఓరేవంత్ భేటీ కావడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరతారని పెద్దఎత్తున ప్రచారం జరిగింది. పొలిట్‌బ్యూరో సమావేశంలో భిన్నాభిప్రాయాలు, భిన్నఆలోచనలు వ్యక్తంమయ్యాయి. టీఆర్ఎస్‌తో జతకడితే తాను ఎట్టి పరిస్థితుల్లో పార్టీలో ఉండే ప్రసక్తే లేదని రేవంత్ తేల్చిచెప్పినట్లు తెలిసింది. దానికి ధీటుగానే పార్టీ అధ్యక్షుడు ఎల్. రమణ సైతం కాంగ్రెస్‌తో పొత్తు ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. కొద్దిసేపు రమణ, రేవంత్‌రెడ్డి, ఇతర నాయకుల మధ్య రసవత్తర చర్చ జరిగినట్లు తెలిసింది. టీఆర్ఎస్ లేదా కాంగ్రెస్‌తో పొత్తు వల్ల పార్టీకి నష్టం కలుగుతుందని, స్వతంత్రంగానే ఎన్నికల బరిలో దిగాలని మరికొంతమంది సూచించారు. రేవంత్‌రెడ్డి, రమణ ఎడమొహం పెడమొహంగా ఉన్నారు.

వరద మైదానాలను నాశనం చేయకుండా ని'వారించండి'

విక్రం సోని

రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ : ప్రకాశం బ్యారేజి ఎగువన అమరావతి వరకు ఉన్న కృష్ణానది వరద మైదానాలను నాశనం చేయటాన్ని నివారించాలని ఢిల్లీ జల్ బోర్డు సలహాదారుడు, నదీ పరిరక్షణ క్రూ సేడర్ అయిన ప్రొఫెసర్ విక్రం సోని జాతీయ హరిత ట్రిబ్యునల్‌కి(ఎన్.జి.టి.) విజ్ఞప్తి చేసారు. ఈప్రాంతంలో వరద మైదానం, తడి భూముల రక్షిత హోదాను ఉల్లంఘించటం, ఎన్.జి.టి. ఈ పరిణామాలను పర్యవేక్షించలేక పోయినందున, ఈ రక్షిత ప్రాంతాలపై జరుగుతున్న అన్ని నిర్మాణాలపై స్టే ఇవ్వాలని, ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలను తీసివేయాలని అన్నారు. ఎన్.జి.టి. ప్రధానంగా పర్యావరణాన్ని కాపాడేందుకు, చట్టపరంగా ప్రజాప్రయోజనార్థం కొరకు ఏర్పడింది. అయితే కొన్ని స్వార్థపూరితమైన శక్తులు అభివృద్ధి పేరుతో కేసులను ఆలస్యం చేసి పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్నారు. ఎన్.జి.టి. ఈ విషయంలో వేగంగా స్పందించి ప్రకృతి వనరుల వినాశనాన్ని నివారించగల గాలని సోని అన్నారు. ఢిల్లీలోని రక్షిత యమునా వరద మైదానాల్లో పర్యావరణ ఉల్లంఘనకు ఆర్ట్‌ఆఫ్ లివింగ్ ఫౌండేషన్స్ జరిమానా విధించటంపై ఎన్.జి.టి ని ప్రసంశించారు. మరోవైపు అమరావతి రాజధాని నగరంలో కృష్ణానది

- మిగతా 3 లో

మాటిచ్చారు.. ముంచారు..!

రాజధానిలో ఉద్యోగం,ఉపాధి 'కల్పనే'

రాజధాని వార్తలు ప్రతినిధి, తుళ్ళూరు

'అంతన్నారు..ఇంతన్నారు..ఎంతో చేస్తామన్నారు.భూములు తీసుకున్నారు.మూడేళ్ళయినా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించలేక పోయారని..' రాజధాని ప్రాంత నిరుద్యోగులు, వ్యవసాయకూలీలు మండిపడుతున్నారు.రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన కుటుంబాలలోని పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తామని, వ్యవసాయకూలీలకు వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని ప్రభుత్వం నమ్మబలికింది. ఇందుకనుగుణంగా రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల్లో సిఆర్‌డిఎ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బందితో సర్వే నిర్వహించింది. విద్యార్హతలు, ఏరంగంలో ఆసక్తి ఉంది..? తదితర వివరాలను నమోదుచేశారు. అనంతరం కొంతమంది చదువుకున్న వారిని ఎంపికచేసి శిక్షణకోసమంటూ శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్లకు పంపారు.ఉన్నత విద్యార్హతలున్నప్పటికీ 5-6వేల రూపాయిలకు మించి వేతనం ఇచ్చే అవకాశం కానరాకపోవడంతో శిక్షణకు వెళ్ళినవారు అర్ధాంతరంగా వెనుదిరగాల్సి వచ్చింది. అధికారులను గట్టిగా ప్రశ్నిస్తే 'మేము ఉద్యోగాలు ఇస్తామని చెప్పలేదు.ఉద్యోగాలు పొందడానికి అవసరమైన వృత్తి నైపుణ్యశిక్షణ మాత్రమే ఇస్తామంటూ' చెప్పడంతో నీరుగారిపోయారు.ఆ తరువాత మొక్కుబడిగా ఉద్యోగమేళాలు నిర్వహించినా ఆశించిన స్థాయిలో ఉద్యోగాలు లభించలేదు.ఈ అంశంపై ప్రతి సభ,సమావేశాల్లో అధికారులను నిలదీస్తున్నా సరైన సమాధానం రావడంలేదని రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు వ్యవసాయ భూములపై ఆధారపడి జీవనం సాగించే కూలీల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల్లో 1,00,096 మంది జనాభా ఉండగా వీరిలో 23వేల మంది రైతులు కాగా మిగిలినవారు వ్యవసాయకూలీలు,చేతివృత్తిదార్లు,ఇతర వర్గాలకు చెందినవారు.రాజధాని నిర్మాణానికి భూములు సమీకరించేటప్పుడు ప్రభుత్వం వ్యవసాయకూలీలకు అమరావతి రాజధాని పింఛను రూ2,500లతో పాటు వారికి వృత్తినైపుణ్య శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది.శిక్షణ ద్వారా రాజధాని నిర్మాణ అవసరాలకు అనుగుణంగా కూలీలను నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దుతామని ఆర్భాటంగా ప్రకటించింది. మూడేళ్ళయినా ప్రభుత్వం ఇచ్చిన హామీ హామీగానే మిగిలిందని కూలీలు ఆవేదన చెందుతున్నారు.నర్సరీల ఏర్పాటుతో 5 వేలమంది కూలీలకు పనికల్పిస్తామని ఆచరణలో వందలమందికే పరిమితమైందని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.దీంతో పనులు లేక దూరప్రాంతాలకు ఆటోల్లో ,ట్రాక్టర్లలో కూలిపనుల కోసం పక్క మండలాలోని గ్రామాలకు వెళ్ళాల్సివస్తోందని కూలీలు చెబుతున్నారు.కుటుంబ పోషణ కోసం భవన నిర్మాణ పనులకు వెళ్ళి ప్రాణాలు కోల్పోవాల్సివస్తోందని,నెక్కల్లు గ్రామానికి చెందిన ముప్పూరి ధనలక్ష్మీ సిమెంటు బొచ్చె పై అంతస్థుకు మోసుకెళుతుండగా జారిపడి మృతిచెందిన ఉదంతాన్ని గుర్తుచేసుకుంటున్నారు. భవన నిర్మాణరంగం ఇటీవల వరకు కొంత ఆశాజనకంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం గడ్డుగా ఉందని కార్మికులు చెబుతున్నారు.రియల్ ఎస్టేట్ పుంజుకోకపోవడంతో ఆ ప్రభావం నిర్మాణరంగంపై పడిందని,దీంతో 4 గురు పనిచేసేచోట 8మంది చేయాల్సివస్తోందని కార్మికులు చెబుతున్నారు. రైతులు, కూలీలు, కార్మికులతో పాటు చేతివృత్తిదారులను సైతం ప్రభుత్వం విస్మరిం చిందన్న అభిప్రాయం రాజధాని ప్రాంతంలో వ్యక్తమవుతోంది. క్షౌర వృత్తిదారులు, కల్లుగీత కార్మికులు ,మోటారు రంగంపై ఆధారపడి జీవనం సాగించేవారికి సైతం ఇబ్బందులు ఎదురవుతు న్నాయని అంటున్నారు. రాజధానికి ముందు రూ2,3 వేలు అద్దె చెల్లించి భార్బరు షాపులు నిర్వహిస్తుండగా ఇప్పుడు అమాంతంగా రూ 8-10 వేలకు పెంచడంతో చెల్లాచెదురయ్యామని, చెరువుకట్టలపై షాపులు పెట్లుకోవాల్సివస్తోందని బార్బర్లు వాపోతున్నారు. దశాబ్దాలుగా రోడ్డుపక్కన వాహనాలకు పంచర్లు,వెల్డింగ్ తదితర పనులు చేసుకునే తమను రోడ్డుపక్కనుంచి వెళ్ళిపోవాలని పోలీసులు ఒత్తిడి చేస్తున్నారని మోటారు కార్మికులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను ఎప్పటికి నెరవేర్చుతుందోనని రాజధాని ప్రాంతంలోని రైతులు,కూలీలు, చేతివృత్తిదారులు, కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రాజధాని వార్తలు

కలం

ప్రణాళికల లోపమేనా!?

మనం ఒక 'ప్రణాళిక వేయటంలో విఫలమైతే, విఫలం అవటానికి ప్రణాళికను రచించాల్సి వస్తుందనే ' నానుడి మన ఆంధ్రప్రదేశ్ రాజధానికి వర్తిస్తుందేమో. పక్కా ప్రణాళిక వేసి నూటికి నూరు పాళ్లు నిష్పక్షపాతంగా అమలు జరిపినపుడే ప్రభుత్వ పథకాలు ప్రతి పౌరునికి అందుబాటులోకి వస్తాయి. ప్రత్యేకించి ఆర్థికంగా వెనుకబడిన వర్గ ప్రజల అభివృద్ధికి దోహద పడతాయి. 2015 నుంచి నిశితంగా మన రాష్ట్ర రాజధాని అమరావతిలో జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ప్రణాళికలు రచించటంలో ప్రభుత్వం ముందు చూపును మరిచింది. కొన్ని ప్రధాన ప్రభుత్వ విధానాలను విశ్లేషిస్తే ప్రణాళికల రచన, అమలులో ప్రభుత్వం విఫలమైందని చెప్పవచ్చు. భూమి సమీకరణ విధానాన్ని గమనిస్తే ఎంత భూమి కావాలో ముందుగా నిర్ధేశించకుండా కొన్ని మండలాల పరిధిలో తీసుకోవాలని, తరువాత మరికొన్ని గ్రామ పరిధిలో గల గ్రామ భూములను భూ సమీకరణలో తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రభుత్వం ఎంచుకున్న పరిధిలో రాజధానికి కావలసిన భూసమీకరణ సంపూర్తిగా చేయలేక పోవటం ఒక వైఫల్యమే. ఎక్కువ శాతం భూ సమీకరణ జరిగినప్పటికీ ఆయా గ్రామాలలో కొన్ని కొన్ని చోట్ల భూ సమీకరణలో లోపంతో ప్రభుత్వం చేయదలచుకున్న అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. అసలు కొన్ని ప్రాంతాలు మన చట్టంలో రక్షింపబడిన ప్రాంతాలు, మరి వాటిని తీసుకోవటమనే ప్రణాళిక రచించటమే ఒక తప్పిదం. దీంతో ఈ రోజు ప్రభుత్వమే న్యాయస్థానాల చుట్టూ పరిభ్రమించవలసి వస్తున్నది. ఎంతో ప్రయాసలతో ప్రభుత్వం చేపట్టవలసిన అభివృద్ధికి నిరాటంకం కల్గింది. ఇక భూ సేకరణలో ప్రభుత్వం భూమిని రాజధాని కొరకు తీసుకోవాలనే ప్రణాళిక. నిజంగా ఒక ప్రణాలిక ఉందో లేదో అనే మీమాంశ మనకు కల్గుతుంది. ఎందుకంటే రాజధాని గ్రామాల్లో ప్రభుత్వానికి భూములు సమీకరణ పద్ధతిలో ఇవ్వని వారికి 2013 భూ సేకరణ చట్టానికి లోబడి తీసుకుంటామని అనేక పర్యాయాలు పత్రికాముఖంగా, ప్రభుత్వ ప్రతినిధులు, పాలకులు చెప్పారు. దీనిపై కోర్టులో వ్యాజ్యాలు దాఖలవటం ప్రభుత్వం దీనిపై ఒక స్పష్టమైన విధాన నిర్ణయాలు తీసుకోకపోవటం భూసేకరణ ప్రణాళికా వైఫల్యమే. ఇక రాజధాని రైతు కూలీలకు వ్యవసాయ పనులు లేకపోవటంతో ప్రభుత్వం వారికి నెలవారి రూ.2,500ల పింఛను పథకాన్ని అమలుచేస్తున్నది. రైతు కూలీలెవరో నిర్ధారించి ప్రతి గ్రామంలో ఒక నివేదికను అధికార పార్టీ ప్రముఖుల అండదండలతో తయారు చేయించారు. వారికే రైతు కూలీ పింఛన్ ఇస్తున్నారు. ఈ ప్రణాళికను రచించిన నాయకులు బీద రైతు కూలీలను, అర్హులైన ఒంటరి మహిళలను విస్మరించారు. ఎకరాల యజమాని కూడా రైతు కూలీ పింఛన్‌కు అర్హుడెలా అవుతాడు! ఇక రోడ్ల నిర్మాణం, రాజధానికి సీడ్ యాక్సెస్ రోడ్ దాదాపు 18. కి.మీ., మేర నిర్మాణం తలపెట్టారు. దీనికి అనుబంధంగా క్రాస్ రోడ్లు ఉన్నాయి. మొత్తం భూమి ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిన తరువాత రోడ్ల నిర్మాణం తలపెట్టితే పనులు త్వరగా అయి అభివృద్ధి ఫలితాలు అందరికీ అందేవి. కాని కొన్నిచోట్ల రైతులు భూమి ప్రభుత్వానికి ఇవ్వక పోవటంతో రోడ్ల నిర్మాణంలో జాప్యం జరిగింది. దీంతో నిర్మాణ వ్యయాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఇది చివరకు భారంగా పడేది ప్రజలపైనే. తెలివిగా ప్రణాళిక రచించలేకపోవటం దురదృష్టకరం. ఇక అమరావతి నగర నిర్మాణ డిజైన్లను చూస్తే ప్రభుత్వం అనేక పర్యాయాలు ఉత్తమ డిజైన్లు ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించేలా ఉండాలని మన ఉత్తమ ఇంజనీర్లను మరచి విదేశీ సంస్థలకు ఈ డిజైన్ ప్రాజెక్టును ఇవ్వటం చూస్తే విడ్డూరంగా ఉంది. మనచరిత్రని, మన సంస్కృతిని,మన ఇంజనీర్లు,మన డిజైనర్లు, కొంతవరకు సినిమా డైరెక్టర్లు ప్రతిబింబం చేయగల్గుతారు. కానీ, విదేశీ కంపెనీలు ఎలా చేయగలరు? అందుకే ప్రభుత్వం విదేశీ కంపెనీ నార్మల్ ఫోస్టల్ రచించిన డిజైన్ నచ్చక మన దేశీయ నిపుణులను తీసుకువెళ్లి సలాహా సూచలను ఇప్పిస్తున్నారు. ముందుగా మనసంస్కృతి, చరిత్రను తెలిసిన సిద్ధహస్తులను, అమరావతి నిర్మాణ డిజైన్‌లో పాలుపంచుకున్నట్లయితే కొంత సమయం ఖర్చులు తగ్గేవి. ఇప్పటికైనా ఒక పక్కా ప్రణాళిక వేసి నిష్పక్షపాతంగా నిర్ద్వందంగా అమలు చేసి ప్రజల పక్షాన ప్రభుత్వ అధికారులు, పాలకులు, పథకాలను అమలు చేస్తే అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ ప్రజలు ఆకర్షితులై ఆదరిస్తారు.

మన కోసం

శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్	తుళ్ళూరు	చందోలు సత్యనారాయణ	9441411432
రెస్టారెంట్స్			
బిర్యానిస్	విజయవాడ	బిర్యానిస్	7032202222
స్వాగత్ మెస్(వెజ్)	మల్కాపురం	చిగురుపాటి	90329 58580
ఎస్.ఆర్.కె. గ్రాండ్	మందడం	శ్రీనివాస్	9553023388
షాప్స్			
రేమాండ్స్‌టైలర్స్	తుళ్ళూరు	ఎస్.కె. జాని	9492470426
వర్షిత ఫోటోస్టాట్	రాయపూడి	పోతురాజు	9985853188
బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్	రాయపూడి	షేక్. మజీదు	7095880828
కె.జి .ఎన్. కారు ట్రావెల్స్	రాయపూడి	ఎస్.కె.సుబాని	97040 74820,
వైభవ్ డ్రెస్సెస్	తుళ్ళూరు	ఎస్వి. పున్నారావు	9848407935
చైతన్య గోదావరి బ్యాంకు	రాయపూడి		08645244266
ఉంగరాల హస్సేన్ టెంట్‌హౌస్	రాయపూడి	ఉంగరాలఖాజ	9441275466
అంజుమన్ టెంట్ హౌస్	రాయపూడి	పఠాన్ బాషా ఖాన్	9502085516
ట్రేడర్స్			
సాయి గణేష్	వెలగపూడి	జొన్నలగడ్డ మనోజ్ కుమార్	7382371111
శ్రీ చంద్రిక	రాయపూడి	కోలా శ్రీనివాసరావు	908073516

మ్యారేజీ లింగ్స్

షేక్ జానీ	విజయవాడ	9948450761

కాలుష్యకోరల్లో ఢిల్లీ

- పండుగ రోజు ఉదయం నుంచి టపాసుల మోత
- సుప్రీం కోర్టు ఆదేశాలు బేకాతరు

న్యూఢిల్లీ : దీపావళి సందర్భంగా టపాసులను పేల్చి వాయు కాలుష్యాన్ని మరింత పెంచొద్దంటూ సూచిస్తూ బాణాసంచాపై సుప్రీంకోర్టు నిషేదాజ్ఞలు విధించింది. అయితే అత్యున్నత న్యాయస్థానం జారీచేసిన నిషేదాజ్ఞలు దేశరాజధానిలో కాలి బూడిదయ్యాయి. టపాసుల పొగలో మసగబారిపోయాయి. దీపావళి రోజు సాయంత్రం ఢిల్లీలో బాణసంచా మోత మోగింది. దీంతో కాలుష్యం యథావిధిగా పెరిగిపోయింది. ప్రజలు మరోసారి కాలుష్యం గప్పెట్లో చిక్కుకున్నారు. ఎయిర్ క్వాలిటీ ఫోర్‌క్యాస్టింగ్ అండ్ రీసెర్చి (సఫర్) ఇండికేటర్ ముదురు గోధుమ రంగులోకి మారి వాయు కాలుష్యం తీవ్రతను స్పష్టంచేసింది. గాలి నాణ్యత చాలా నాపిరంగా ఉన్నట్టు గుర్తించింది. దీనివల్ల ఢిల్లీ ప్రజలు ముఖ్యంగా హృద్రోగులు, శ్వాసకోస వ్యాధులతో బాధపడేవారు తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం పొంచి ఉందని. దేశ రాజధానిలో వాయు కాలుష్యం అసలే ఎక్కువ. దీనికి బాణాసంచా పేలుళ్లు తోడవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిపోయింది. వాయునాణ్యత ప్రమాదస్థాయిలో ఉన్నట్టు అమెరికా దౌత్యకార్యాలయం కాలుష్యం మానిటర్ గుర్తించింది. గరిష్ఠ రీడింగ్ 500 కాగా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 878దాకా వెళ్లింది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో బాణాసంచాపై సుప్రీంకోర్టు నిషేధం విధించడంతో పరిస్థితి కొంత నయంగా కనిపించింది. దీపావళి రోజు సాయంత్రం దాదాపు ప్రశాంతంగానే గడిచింది. గత దీపావళికి కాలుష్యం సీనియర్ జోన్‌లో ఉండగా ఈ సారి అది గంటల తర్వాత ఢిల్లీలో బాణాసంచ మోత మోగింది. దాదాపు అర్ధరాత్రి వరకు టపాసుల శబ్దాలు వినిపించాయి. తత్ఫలితంగా కాలుష్యం గ్రాఫ్ తీవ్రస్థాయికి చేరుకుంది. కాలుష్య పర్యవేక్షణ కేంద్రాల్లోని ఆన్‌లైన్ ఇండికేటర్లు ఎరుపు రంగులోకి మారి 'వెరీపూర్' వాయు నాణ్యతను సూచించాయి. రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు కాలుష్యస్థాయి ఎక్కువగా నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఢిల్లీ పరిసర ప్రాంతాలైన గురుగ్రామ్, నోయిడా, గాజియాబాద్‌క్షలో బాణాసంచా శబ్దాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. మూడేళ్లుగా తీవ్రంగా ఉన్న వాయు నాణ్యత ఈ సారి కొంత మెరుగుగా ఉన్నట్టు 'సఫర్' పేర్కొంది. కాగా, ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని అదుపు చేసేందుకు సుప్రీంకోర్టు పర్యావరణ కాలుష్యం నివారణ, నియంత్రణ యంత్రాంగం (ఈపీసీఏ)ని నియమించడం తెలిసిందే.

204 'అగ్ని'కాల్స్ వస్త్ర గోడౌన్‌లో భారీ ప్రమాదం

దీపావళి సందర్భంగా దేశరాజధానిలో 200కు పైగా అగ్నిప్రమాదాలు సంభవించాయి. గత రాత్రి తూర్పు ఢిల్లీలోని ఒక వస్త్ర గోడౌన్‌లో భారీ ప్రమాదం సంభవించినట్టు అగ్నిమాపక దళాధికారులు వెల్లడించారు. ప్రమాదాలు జరిగినప్పుడు వేర్వేరు ప్రాంతాల నుంచి మొత్తం 204 ఫోన్‌కాల్స్ వచ్చినట్టు తెలిపారు. వీటిలో 51 బాణాసంచా పేలుళ్లు వల్ల సంభవించినవని అన్నారు. 'తూర్పు ఢిల్లీలో రాత్రి 10.10 గంటలకు సుషాష్ మొహల్లాలోని వస్త్ర గౌడౌన్‌లో భారీ అగ్నిమాదం చోటుచేసుకుంది. 26 అగ్నిశకటాలు హుటాహుటిని ప్రమాదస్థలికి చేరుకున్నాయి. అది 23 అంతస్తుల భవనం. అయితే, ఈ ఘటనలో ఎవ్వరూ గాయపడలేదు' అని ఢిల్లీ ఫైర్ సర్వీస్ (డీఎఫ్ఎస్) అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. 18వ తేదీ అర్ధరారతి నుంచి దీపావళి రోజు అర్ధరాత్రి 204 కాల్స్ వచ్చాయని, గతేడాది 243 కాల్స్ వచ్చాయని ఆయన్నారు. అర్ధరాత్రి గడిచిన తర్వాత కూడా 75 కాల్స్ వచ్చాయని డీఎఫ్ఎస్ అధికారి తెలిపారు. దేశ రాజధానిలో ఉన్న శ్వాశత ఫైర్ స్టేషన్లు 59 కాగా నగరవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో 28 తాత్కాలిక స్టేషన్లను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. అంతేకాకుండా కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌లైన్లనూ పెంచినట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో కూడా ధ్వని కాలుష్యం అధికంగా ఉందని తెలిపారు.

చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ ఎన్నికకు గ్రీన్ సిగ్నల్

- ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ : ఈ నెల 29
- నామినేషన్ పత్రాల స్వీకరణ ఈ నెల 30 నుంచి నవంబర్ 2
- ఉపసంహరణ : నవంబర్ 3

రాజధాని వార్తలు అమరావతి : ది గుంటూరు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ ఎన్నిక నవంబర్ 6న జరగనున్నట్లు ఎన్నికల అధికారుల లాయర్ రామసుబ్బారెడ్డి, కట్టా విద్యాసాగర్ ప్రకటించారు. ఈ ఎన్నికల మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు గీతా మందిరంలో జరగనుంది. ఈ ఎన్నికలో ఆఫీస్ బేరర్స్ ప్రెసిడెంట్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్‌లను ఎన్నుకోవాలని ఈ నెల 16న జరిగిన సర్వసభ్య సమావేశంలో నిర్ణయించారు. సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక జరుగనుంది.

గీతా మందిరంలో నవంబర్ 6న ఎన్నిక

మిర్చియార్డు దిగుమతి వ్యాపారుల అసోసియేషన్ ఎన్నికలకు ప్రాధాన్యత ఉంది. ప్రస్తుతం దిగుమతి వ్యాపారుల సంఘం అధ్యక్షుడిగా కుర్రి సాంబిరెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈయన పదవి కాలం ముగియడంతో ప్రస్తుతం ఎన్నిక జరుగుతోంది, ఈ సారీ వీలైనంతవరకు అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవంగా చేసేందుకు ప్రయత్నాలు జరగుతున్నాయి. ఇప్పటికే ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

కృష్ణాతీరంలో అభివృద్ధి అవసరం

రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి : ప్రసిద్ధ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం అమరావతిలోని సుమారు రెండు కిలోమీటర్ల కృష్ణానదీ తీరాన్ని ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పర్యాటక శాఖ సలహాదారుడు ప్రొఫెసర్ గల్లా అమరేశ్వర్ అన్నారు. అమరావతి కృష్ణానది తీరాన్ని విజయవాడ స్కూల్ అఫ్ ప్లానింగ్ అండ్ అర్కిటెక్చర్ విద్యార్థులతో కలిసి పరిశీలించారు. అమరేశ్వర్ మాట్లాడుతూ సుమారు పది మంది విద్యార్థులు రెండు కిలోమీటర్ల నదీ తీరాన్ని రెండు నెలల నుంచి నిశితంగా పరిశీలించి, అభివృద్ధికి అనేక డిజైన్‌లు రూపొందించారని తెలిపారు. ఈసందర్భంగా విజయవాడ స్కూల్ అఫ్ ప్లానింగ్ అండ్ అర్కిటెక్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సిహెచ్. అనీల్ కుమార్ ప్రసంగించారు.

వ్యవసాయంపైనే దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

పర్యవేక్షించగలనన్నారు. ఐటీ,ఐవోటీని అభివృద్ధి చేసి ఏపీలో పారదర్శక, జవాబుదారీ పాలన అందిస్తున్నామన్నారు. రానున్న రెండు దశాబ్దాల వరకు 15శాతం వృద్ధి రేటు సాధనను లక్ష్యంగా నిర్దేశించుకుని పని చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం భారతదేశ సగటు వృద్ధి రేటు కంటే రెట్టింపు అంటే 11.72 శాతం వృద్ధి రేటు సాధించామన్నారు. పరిశ్రమలు నెల కొల్పేందుకు ఏపీ ఎంతో అనుకూలమైందని, పారిశ్రామిక శాంతి ఉంటుందని వివరించారు. దేశంలోనే తొలిసారిగా నదులను అనుసంధానించిన గనత తమ రాష్ట్రం సొంతమన్నారు. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు.

రుణమాఫీపై ఐయోవా రాజకీయవేత్త ఆసక్తి

ప్రముఖ రాజకీయవేత్త,ప్రస్తుత అయోవా రాష్ట్ర కార్యదర్శి విలియం హోవార్డ్ బిల్ నార్తేతో సీఎం చంద్రబాబు భేటి అయ్యారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల ఫెడరల్ ప్రభుత్వ వ్యవసాయ శాఖలో ఫామ్ ప్రొడక్షన్, కన్జర్వేషన్ అండర్ సెక్రటరీగా ఇటీవలే ఎంపికైన నార్తేకు సీఎం అభినందనలు తెలిపారు. ఏపీలో అమలు చేసిన రుణ ఉపశమన పథకంపై నార్తే ఆసక్తి చూపించారు. ఈ నవంబరులో విశాఖపట్నంలో జరగనున్న సదస్సుకు హాజరుకావాలని నార్తేను చంద్రబాబు ఆహ్వానించారు. అనంతరం వేగనింగన్ విశ్వవిద్యాలయ అధ్యక్షురాలు ప్రొఫెసర్ ఎల్‌వోఫ్రిస్కోతో సీఎం సమావేశమయ్యారు. ఏఏ అంశాల్లో ఏపీతో కలిసి పనిచేసేందుకు ఆస్కారం ఉందో పరిశీలించేందుకు తమ బృందాన్ని ఏపీకి పంపిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఐయోవా-వేగనింగన్ విశ్వవిద్యాలయాలు ఉమ్మడిగా ముందుకొచ్చి ఏపీ ప్రభుత్వంలో కలిసి పనిచేయడానికి ఒక కన్సార్షియంగా అవిర్భవిస్తే అందరికీ లాభదాయకమని సీఎం సూచించారు. సీఎం ప్రతిపాదనకు అంగీకరించిన ఫ్రిస్కో త్వరలో దీనికి సంబంధించి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటామన్నారు. మరో 45 రోజుల్లో ఇరువురి భాగస్వామ్య కార్యక్రమం రూపుదాల్చగలదని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

సమాచార కమిషనర్ దరఖాస్తు గడువు పెంపు

రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి : రాష్ట్ర సమాచార కమిషన్‌లో సమాచార కమిషనర్, ముఖ్య కమిషనర్ పదవులకు దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. మూడు కమిషనర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు 20 వ తేదీ (శుక్రవారం)తో ముగిసింది. దీపావళి నేపథ్యంలో వరుస సెలవులు వచ్చినందున ఈ గడువును ఈ నెల 30 వరకు ప్రభుత్వం పొడిగిచింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేయదలచిన వారు 30న సాయంత్రం అయిదు గంటల్లోగా పోస్టు ద్వారా గానీ, నేరుగా గానీ, మెసెంజర్ ద్వారా గానీ దరఖాస్తులు పంపించాలని సాధారణ పరిపాలనశాఖ తెలిపింది. రాష్ట్ర సమాచార కమిషనర్, నాలుగో అంతస్తు, డీపీఎస్ కన్‌స్ట్రక్షన్, సాయిబాబా ఆలయం ఎదుట, మంగళగిరి గుంటూరు జిల్లా, పిన్ కోడ్ - 522 503 అనే చిరునామాకు కానీ, సచివాలయంలోని సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో కానీ దరఖాస్తులు సమర్పించవచ్చు. నేరుగా, పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఎలక్ట్రానిక్ విధానంలో పంపిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరని ఈ సందర్భంగా అధికార వర్గాలు తెలిపాయి.

సీఆర్ డీఏ అదనపు కమిషనర్‌గా రత్నకుమార్

రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి : రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) అదనపు కమిషనర్‌గా జి.రత్నకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భారత ప్రభుత్వ టెలీకమ్యూనికేషన్ల శాఖలో ఐటీఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రత్నకుమార్‌ను కేంద్రం ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వ పురపాలక శాఖకు కేటాయించింది. తాజాగా ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా నియమించారు.

తుళ్ళూరు తహసీల్దారుగా పూర్ణచంద్రరావు

రాజధాని వార్తలు ప్రతినిధి తుళ్ళూరు : తుళ్ళూరు తహసీల్దారుగా పూర్ణ చంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన బెల్లంకొండ తహసీల్దారుగా పనిచేశారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రాజధాని అమరావతి పరిధిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు.

ఈబ్యాంకింగ్‌పై అవగాహన ముఖ్యం

రాజధాని వార్తలు ప్రతినిధి, రాయపూడి: ప్రజలకు అన్‌లైన్ బ్యాంకు సేవలపై అవగాహన ముఖ్యమని లీడ్ బ్యాంకు మేనేజర్ విజయ్ కుమార్ తెలిపారు. రిజ్వర్ బ్యాంకు ఆదేశాల మేరకు ఈ బ్యాంకింగ్ సేవలపై ఆర్థిక అక్షరాస్యత శిబిరాలు నిర్వహిస్తున్నాట్లు. ఆయన తెలిపారు. తుళ్ళూరు మండల పరిధిలోని రాయపూడిలో ఆంధ్రాబ్యాంకు మేనేజర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు బ్యాంకులో జరిగే లావాదేవీల గురించి క్షుణ్ణంగా వివరించి, సైబర్ భద్రతపై తగు సూచనలు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో వైఫై ద్వారా అంతర్జాల సేవలను వినియోగించుకునే క్రమంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోపరేటివ్ బ్యాంకు మేనెజర్ పెద్దింటి పరమేశ్, రాయపూడి గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత వ్యాపార రంగంలోకి రావాలి

రాజధాని వార్తలు ప్రతినిధి, తాళ్లాయిపాలెం (తుళ్ళూరు) : చదువుకున్న యువతీ, యువకులు వ్యాపారం రంగంలోను అడుగుపెట్టాలని అత్తోట పోతురాజు ఆకాంక్షించారు తుళ్ళూరు మండల పరిధిలోని మందడం శివారు గ్రామం తాళ్లయిపాలెంలో వివాద పరిష్కారం శాంతి భద్రత అనే అంశంపై గ్రామస్తులతో చర్చా సమావేశాన్ని నిర్వహించిరు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిస్టర్ ఝాన్సీ మాట్లాడేతూ బ్యాంకుల సహకారంతో యువత వ్యాపారంగంలోకి రావాలని కోరారు. సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకోవాలని, ఈ చట్టం వచ్చి 12 ఏళ్లు అవుతున్నా ఈ చట్టంపై అవగాహన ఉండడం లేదన్నారు. మహిళా కో- ఆర్డినేటర్ పులిపాక పుష్పాంజలి గ్రామస్తులు దున్న ఏలీయ, సురేష్, నితిన్ పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభం

రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ : ఇంద్రకీలాద్రిపై కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసంలో ఇంద్రకీలాద్రిపై మూడు నూతన పూజలకు దుర్గగుడి ఈవో సూర్యకుమారి, పాలకమండలి ఛైర్మన్ గౌరంగబాబు, సభ్యులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నటరాజస్వామి మండప ప్రాంగణం పక్కన ప్రత్యేక శివలింగాన్ని ఏర్పాటు చేసి భక్తులు నేరుగా అభిషేకం చేసేందుకు వీలు కల్పించారు. గతంలో మల్లేశ్వరాలయంలో భక్తుల సమక్షంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు వేదపండితులు నిర్వర్తించేవారు. మల్లేశ్వరాలయం మూసివేయడం, బాలాలయంలో అభిషేకం నిర్వహించేందుకు వీలు లేకపోవడంతో నటరాజస్వామి మండప ప్రాంగణం పక్కన ఉన్న పాత అన్నదాన భవనం ప్రాంతంలో లింగార్చన కార్యక్రమానికి ఈవో సూర్యకుమారి శ్రీకారం చుట్టారు. తొలుత స్థానాచార్య శివప్రసాద శర్మ, వైదిక కమిటీ సభ్యులు శంకరశాండిల్య, శ్రీనివాస శర్మ, నర్సింహరావు, ఈవో సూర్యకుమారితో గణపతి పూజ చేయించారు. అనంతరం ఈవో స్వయంగా వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ శివలింగానికి అభిషేకం చేశారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు లింగార్చన అనంతరం ఉభయదాతలకు అమ్మవారి దర్శనం చేసుకునే అవకాశాన్ని కల్పించారు. దీనికి టిక్కెట్టు రుసుము రూ.2 వేలు నూతనంగా మల్లికార్జున మహామండపంలో అమ్మవారికి స్వర్ణ పుష్పపూజకు టిక్కెట్టు రుసుము రూ.2,500 కాగా మల్లికార్జున మహామండపంలో ఉత్సవమూర్తికి నిర్వహించే పుష్పార్చనకు టిక్కెట్టు రుసుము. రూ.650 గా నిర్ణయించారు.

"తాజ్" మాటల తూటాలు

- చరిత్ర నుంచి తొలగించాలి
- బీజేపీ ఎమ్మెల్యే సంగీత్ సోమ్ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : దేశంలో ప్రతిష్టాత్మక స్మారక చిహ్నంగా చరిత్రకెక్కి ఏటా లక్షలాది మంది దేశీయ, విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నా 'తాజ్‌మహల్'పై కాషాయ శ్రేణులు తమ విషాన్ని ఇంకా వెళ్లగక్కుతూనే ఉన్నాయి. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోనూతన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యత చేపట్టిన యోగి ఆదిత్యథ్ పర్యాటక జాబితా నుంచి తాజ్‌మహల్‌ను తొలగించేసి వివాదానికి తెరతీశారు. ఇప్పటి వరకు బాబ్రీ మసీదుపై దృష్టిపెట్టి దేశంలో హింసాత్మక ఘటనలకు కారణమైన బీజేపీ, సంఘ్ పరివార్‌ల దృష్టి ప్రస్తుతం తాజ్‌మహల్‌పై పడింది. తాజ్‌మహల్‌ను దేశ వారసత్వ సంపద నుంచి తొలగించే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి. తాజ్ ఉనికిని బీజేపీ శక్తులు అంతతేలిగ్గా జీర్ణించుకోలేక పోతున్నాయనడానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ శాసన సభ్యుడు సంగీత్ సోమ్ మాట్లాడుతూ 8వ శతాబ్దపు రాజు అంగపాల్ సింగ్ తోమర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత సిసోలి గ్రామంలో కొంతమందిని ఉద్దేశించి మాట్లాడుతూ 'భారత్‌సంస్కృతికి తాజ్‌మహల్ ఓ మాయని మచ్చ లాంటిదన్నారు. దేశ చరిత్ర నుంచి తాజ్‌మహల్‌ను తొలగించడాన్ని చాలామంది జీర్ణించుకోలేక పోయారు.

సందర్శించ వద్దని పర్యాటకులకు చెబుతారా? : ఓవైసీ

హైదరాబాద్ : చరిత్రలో తాజ్‌మహల్ స్థానాన్ని ప్రశ్నిస్తూ బీజేపీకి ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే సంగీత సోమ్ చేసిన వ్యాఖ్యలపై ఏఐఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా స్పందించారు. ఈ స్మారక చిహ్నాన్ని సందర్శించ వద్దని పర్యాటకులకు ప్రభుత్వం చెబుతుందా అని ఆయన 'ఎర్రకోట నిర్మాణం జరిపింది కూడా దేశద్రోహులే. జాతీయ జెండాను ఆ కోట నుంచి ఎగరవేయకుండా మోడీ ఉంటారా తాజ్‌మహల్‌ను సందర్శించ వద్దని దేశీయ, విదేశీ పర్యాటకులకు మోడీ యోగి చెప్పగలరా అని ఓవైసీ ఈ సందర్భంగా తన ట్వీట్‌లో ప్రశ్నించారు. 'దేశద్రోహులు నిర్మించిన ఎర్రకోట ఇపుడు విదేశీ ఉన్నతాధికారులు ఆతిథ్యానికి వేదిక అయ్యిందన్నారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌ను కూడా దేశద్రోహులే నిర్మించారు. విదేశీ ఉన్నతాధికారులకు అక్కడ ఆతిథ్యం ఇవ్వకుండా మోడీ ఆపగలరా అని ఆయన ప్రశ్నించారు. కాగా బ్రిటీష్ వారు ఇచ్చిన భూమిపై చివరి నిజాం ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ హౌస్‌ను నిర్మాణం జరిపారు.

రాష్ట్ర రాజకీయం అమరావతి నుంచే



తరులుతున్న పార్టీ కార్యాలయాలు

రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి : అమరావతి రాజధానికి రాజకీయ పార్టీలు తమ కార్యాలయాలు తరలించేందుకు తహతహలాడుతున్నారు. వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం ప్రారంభమై నాటి నుంచి అధికార పార్టీ పూర్తి స్థాయిలో పార్టీ కార్యకలాపాలు రాజధాని నుంచే సాగిస్తోంది. గుంటూరులో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకున్న టీడీపీ.. శాశ్వత కార్యాలయ ఏర్పాటుపై దృష్టి సారించి విజయవాడలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇటీవల సమన్వయ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ కార్యాలయాల విషయంలో స్పందించారు. ప్రభుత్వం ఏర్పడి మూడు ఏళ్ళు గడవడం, రాష్ట్ర విభజన అనంతరం పూర్తిగా తెలుగుదేశం సుదీర్ఘ అధికారం దిశగా పావులు కదుపుతూ పక్క ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇక ప్రతిపక్ష పార్టీ అయిన వైసీపీ నేటికీ పొరుగు రాష్ట్రమైన తెలంగాణ నుంచే పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అయితే పార్టీ కార్యకర్తలకి చేరువగా ఉండి వారిలో భరోసా కల్పించి అండగా ఉండాలనే లక్ష్యంతో ఇటీవలే విజయవాడలో తాత్కాలిక రాష్ట్ర పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించింది. కాగా పూర్తిస్థాయిలో శాశ్వత రాష్ట్ర కార్యాలయాన్ని తాడేపల్లిలో సిద్ధం చేస్తోంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండేవిధంగా జగన్మోహనరెడ్డి నివాసం కోసం అన్ని విధాలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 10 ఎకరాలు స్థలంలో వైసీపీ పార్టీ కార్యాలయం నిర్మాణం జరుగుతుంది. అలాగే వైసీపీ కూడా ఎన్నికలకి సిద్ధమవుతున్న పరిణామాలే కనిపిస్తున్నాయి. గడప గడపకు వైసీపీ పేరుతో రాష్ట్రంలో విస్తృతంగా పర్యటనలు జరుగుతున్నాయి. నవంబర్ నుంచి జగన్ పాదయాత్ర కూడా ఎన్నికల కసరత్తులో భాగంగానే జరుగుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే జగన్ పాదయాత్ర అనంతరం పూర్తిగా రాజధానికి పరిమితం కానున్నారని సమాచారం, గత ఎన్నికల్లో చేసిన తప్పిదాలని సరిదిద్దుకుంటూ ముందుకు సాగే ఆలోచన చేస్తోంది. ఇతర రాజకీయ పార్టీలతో కలసి ప్రజా పోరాటాలు చేసే ఆలోచనలో వైసీపీ ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. అలాగే జనసేన సైతం విజయవాడలో తమ పార్టీ కార్యకలపాలని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది.

అయితే ప్రధాన కార్యక్రమాలు అన్నీ హైదరాబాద్ కార్యాలయం వేదికగా నిర్వహించాలని భావిస్తోంది.. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సైతం పాదయాత్ర గాని బస్ యాత్ర గాని చేపట్టి రాష్ట్రమంతా పర్యటించే దిశగా అడుగులు వేస్తున్నారు. జనసేన సైనికుల ఎంపికతో పార్టీ కార్యక్రమాల వేగాన్ని పెంచి ప్రజలకి చేరువ కావాలని ప్రయత్నిస్తున్నారు. ఇదే బాటలో లోక్‌సత్తా పార్టీ కూడా విజయవాడలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలని చూస్తోంది. లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ సైతం నవ్యాంధ్రలో తన పార్టీకి పునాదులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాగా వాపపక్షాలు మాత్రం మిగిలిన పార్టీలకంటే ముందే శాశ్వత కార్యాలయాలు విజయవాడలో ఏర్పాటు చేసుకున్నాయి. సీపీఐ, సీపీఎం విజయవాడలో పార్టీ కార్యాలయాల నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. వామపక్ష పార్టీలు పూర్తిగా ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములుగా ఉంటూ తమదైన శైలిలో ముందుకెళ్తున్నాయి. మొదటిగా రాజధానిగా పార్టీ కార్యకలపాలని ప్రారంభించిన పార్టీలు వామపక్ష పార్టీలే కావటం విశేషం. బీజేపీ సైతం తమ పార్టీ ప్రాభల్యం పెంపొందించుకొనే దిశగానే అడుగులేస్తోంది. విజయవాడలో రాష్ట్ర కార్యాలయం ఏర్పాటు చేసుకొని ముందుకు కదులుతోంది. ప్రజల్లోకి ఉచిత వైద్యం, విద్య, మంచినీరు అందించే స్లోగన్‌తో కొత్తగా జనవాహిని పార్టీ ఆవిర్భవించింది. ఆ పార్టీ కార్యాలయాన్ని కూడా విజయవాడలో ప్రారంభించింది. ఎన్నికల సంఘం నుంచి, అసెంబ్లీ నుంచి గాని, సచివాలయం నుంచి గాని ప్రభుత్వ,ఇతర ప్రభుత్వేతర సమాచారం ఇవ్వడానికి కూడా అమరావతి సమీపంలో కార్యాలయాలు ఉంటేనే మంచిదని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు సమయత్తమవుతున్నాయి.

కాలమ్

ఒక రోజు దేవుడు ఓ కుక్కని తయారు చేసాడు.

దేవుడు అన్నాడు : రోజంతా ఇంటి ముందు కూర్చో. ఎవరైనా తెలియని వాళ్ళు వస్తే అరువు.

నేను నీకు 20 ఏళ్ళు ఆయుష్షునిస్తాను.

కుక్క : స్వామి ఇదేమి బాలేదు.. నేను అన్ని ఏళ్ళు అరవలేను.

కాబట్టి ఇదుగో 10 ఏళ్ళు నీకు ఇచ్చెస్తాను. 10ఏళ్ళు మాత్రమే అరుస్తాను సరేనా!

దేవుడు : సరే

ఆ తర్వాతి రోజు దేవుడు ఒక కోతిని తయారు చేశాడు.

దేవుడు : నీ కోతి చేష్టలు చేస్తూ జనాల్ని సంతోషపరుచు.

నీకు 20 ఏళ్ళు ఆయుష్షు ఇస్తున్నాను.

కోతి : ఏంటి !!

కోతి చేష్టలు 20 ఏళ్ళా! అమ్మో!

కుక్క తన 10 ఏళ్ళు నీకు ఇచ్చింది గా!

నేను అలాగే ఇస్తాను.

దేవుడు : నువ్వు రైతుతో పాటు పోలానికి వెళ్లి రోజంతా ఎండలో కష్టపడి సాయంత్రం పాలు ఇస్తూ, రైతుకి సహాయం చేయి. నీకు 60ఏళ్ళు ఆయుష్షు ఇస్తున్నాను.

ఆవు : 60 ఏళ్ళు ఈ గొడ్డు చాకిరీ నేను చేయలేను. నాకు కూడా 20 ఏళ్ళు ఇచ్చి మిగతా 40 ఏళ్ళు నువ్వే తీసుకో...

దేవుడు : సరే...

తర్వాత రోజు దేవుడు మనిషిని తయారు చేసాడు.

దేవుడు : తిను, తాగు, ఆడుకో,పెళ్లిచేసుకో, నీ జీవితాన్ని ఆనందించు..

నేను నీకు 20 ఏళ్ళు ఆయుష్షుని ఇస్తున్నాను.

మనిషి : ఏంటి? 20ఏళ్ళేనా? చూడు, నా 20 ఏళ్ళు తో పాటు ఆవు నీకు ఇచ్చిన 40, కోతి మరియు కుక్కకి ఇచ్చిన 10+10 మొత్తం : 80 ఏళ్ళు కావాలి.

దేవుడు : సరే...

అందుకే మొదట 20 ఏళ్ళు మనిషి తింటున్నాడు, నిద్రపోతున్నాడు, ఆడుకుంటున్నాడు, ఆనందిస్తున్నాడు..

తరువాత 40 ఏళ్ళు ఆవు చేస్తున్నట్లు తన కుటుంబానికి సహాయం చేయటానికి గొడ్డు చాకిరీ చేస్తున్నాడు.

ఆ తర్వాత 10 ఏళ్ళు కోతి చేష్టలు చేస్తూ తన మనవల్లు, మనవరాళ్లని నవ్విస్తున్నాడు...

తరువాత 10.. ఇంటి ముందు కూర్చొని వచ్చే పోయే వాళ్ళని అరుస్తుంటాడు...

– ఏమి మనిషి జీవితం రా ఇది...

ఈ ఏడాది చాలా పేలాయి!

పెద్దనోట్లు పేలాయి...
నల్లధనం బతికింది జీఎస్టీ పేలింది... జగమంతా చీకటైంది విశాఖ రైల్వే జోను తుస్సుమంది..
అరచేతిలో అమరావతి హారతి కర్పూరం అయింది!
ఇంకా కనబడలేదా!.. వెలుగునిచ్చే దీపావళి!!
అయితే వేచి చూడండి..
వచ్చే ఎన్నికల దీపావళికి
మందుగుండు సామాగ్రికి సన్నాహాలు మొదలెట్టాం!
చాందాలు ఇవ్వండి!
చంద్రమండాలనికి చంద్రాయణం సాగిద్దాం!
గాల్లో మేడలు కడదాం.. కాకిక్కూడా కథలు చెపుదాం!
ఇది మా వాక్ బాణం..నమ్మండి!
నమ్మి ఓటు వేయండి!
మీరు మాత్రం ఈ సాముహిక గీతాన్ని మళ్ళీ మళ్ళీ వింటూనే ఉండండి! దీపావళి శుభాకాంక్షలు
(దీపావళి కదా.... అక్షర బాంబులు పేలాయి)

అమెరికా సభలో గౌరీ... ఐలయ్యపై చర్చ...!

వాషింగ్టన్ : 'భారత్‌లో మతోన్మాదులు రెచ్చిపోతున్నారు. హిందూత్వ టెర్రరిజం తారా స్థాయికి చేరుతోంది భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలుగుతోంది. అభ్యుదయ రచయితలను ప్రగతిశీతంతంతంతల పాత్రికేయుల ప్రాణాలకు రక్షణలేకుండా పోయింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ సమాజం తీవ్రంగా పరిగణించాలి. ఇదీ అమెరికా ప్రతినిధుల సభలో సభ్యుల అభిప్రాయం ఇటీవల అభ్యుదవాది, ప్రగతిశీల పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ దారుణ హత్య సామాజిక రచయిత ఆచార్య కంచ ఐలయ్యపై దాడులు, హెచ్చరికలపై అమెరికా ప్రతినిధుల సభ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చర్యలను ఆదిలోనే తెంచివేయక పోతే ప్రజాస్వామిక శక్తుల మనగడకే పెనుముప్పు తప్పదని అమెరికా సభలో ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆరిజోనా రిపబ్లిక్ పార్టీ ప్రతినిధి హెరాల్డ్ ట్రెంట్ ఫ్రాంక్స్ మాట్లాడుతూ ఒకరిని విమర్శించటం లేదా ఒకరి అభిప్రాయాన్ని మరొకరు అంగీకరించటాన్ని తీవ్రంగా పరిగణించి దాడులుకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగతిశీల రచయితలు గోవింద్‌పన్సారే ఆచార్య ఎంఎం కాల్‌బుర్గి నరేంద్ర దబోల్కర్‌ను హతమార్చినట్టే గౌరీ లంకేశ్‌ను హత్య చేశారని వివరించారు. ముఖ్యంగా ఆచార్య ఐలయ్యపై జరుగుతున్న దాడిని ముక్త కంఠంతో ఖండించాలని సభకు కోరారు. కంచ ఐలయ్య ప్రాణాలకు ముప్పు ఏర్పడిందని, అంతర్జాతీయ సమాజం ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించటమే కాదు, ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందని హెరాల్డ్ చెప్పారు. బీజేపీ మిత్రపక్షం తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఏకంగా ఐలయ్యను బహిరంగంగా ఉరి తీయాలని డిమాండు చేశారని, సభకు వెళ్తున్న ఐలయ్యపై హిందూత్వ మూకలు రాళ్లతో దాడి చేశాయని, ప్రస్తుతం ఆయన స్వీయ గృహ నిర్భంధంలో ఉన్నారని హెరాల్డ్ ఆవేదన వ్యక్తం చేశారు. గౌరీ లంకేశ్ హత్య ఐలయ్యపై దాడులు, త్రిపురలో యువజర్నలిస్ట్ సంతాను భౌమిక్ దారుణహత్యతో... భారత్‌లో మానవహక్కులకు భంగం కలుగుతుందనే అపవాదు తప్పటం లేదని, ఇలాంటి స్థితిలో భారతదేశం ఇలాంటి ప్రముఖ రచయితలను కాపాడుకోవాల్సిన బాధ్యతను భరత్ గుర్తించాలని ప్రజాస్వామిక వాదులు రక్షణకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.

దళితులు, ముస్లింలు ఐక్యం కావాలి

న్యూఢిల్లీ : దళితులు,ముస్లింలు ఐక్యమై బీజేపీనీ రానున్న ఎన్నికల్లో ఓడించాలని రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కలిసి భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎలాంటి చర్య తీసుకోకుండా నిలువరించాలని ఆయన కోరారు. రాజ్యాంగాన్ని చట్టాలను పరిరక్షించుకునేందుకు ముస్లిం లు, దళితులు ఐక్యం కావాలన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కలిసి 2022 నాటికి లోక్‌సభ రాజ్యాంగాన్ని రూపొందించి న్యూ ఇండియాను ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారని ప్రకాశ్ అంబేద్కర్ చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన సభలో మాజీ ఎంపీ అయిన ప్రకాశ్ తన ప్రసంగం కొనసాగిస్తూ ఆర్ఎస్ఎస్, బీజేపీలు కలిసి గుజరాత్‌ను తమ ప్రయోగశాలగా ఎంచుకున్నాయని ఆయన అన్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాటం చేయడమా, లేక వాటితో కలిసి ప్రయాణం చేయడమా అనేది మీరే నిర్ణయించుకోండి, రాజ్యాంగం మనువాదం మీ ముందున్నాయి. మీ మనుగడ కోసం రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం మీ కర్తవ్యం అని ఆయన అన్నారు.

తానా రూపొందించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించిన చంద్రబాబు

బూర్గంపాడు : పోటీ పరీక్షలకు హాజరయ్యే తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఉపయోగపడేలా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) రూపొందించిన వెబ్‌సైట్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం అమెరికాలో ప్రారంభించారు. చికాగోలో నిర్వహించిన కార్యక్రమంలో 'మై ప్రోగ్రెస్‌కార్డ్. కామ్' వెబ్‌సైట్ ప్రారంభోత్సవం జరిగినట్లు తానా కాబోయే అధ్యక్షుడు (ఎలెక్టెడ్ ప్రెసిడెంట్) తాళ్లూరి జయశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షలు, ఇతర పరీక్షల కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వివిధ స్థాయిల్లో ఉపయోగపడే సమగ్ర సమాచారాన్ని పొందుపర్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు తానా ప్రతినిధులు, ఇతర ప్రముఖుల పాల్గొన్నట్లు ఆయన చెప్పారు.

వరద మైదానాలను నాశనం చేయకుండా ని'వారించండి'

(మొదటిపేజీ తరువాయి)

వరద మైదానాల విషయంలో ఎన్.జి.టి.లో అనేక పిటీషన్‌లు దాఖలు చేసి ఉన్నాయన్నారు. ఇక్కడ నిర్మాణాలు చేపట్టవద్దని ఈ పిటిషన్ల సారాంశం అయితే వాదనలు ప్రతివాదనలు విన్న తరువాత ఎన్.జి.టి తీర్పును ఏప్రిల్ 20,2017న రిజర్వుచేశారు. అయితే తీర్పు రిజర్వు చేసిన తరువాత అనేక ఉల్లంఘనలు జరిగాయి. వాటిలో 12 కి.మీ పోడవు సీడ్ యాక్సెస్ రోడ్డు, నదికి పక్కనే ముఖ్యమంత్రి నివాస సముదాయం, కొండవీటివాగు ఎత్తపోతల పథకం నిర్మాణాలు జరిగాయి. గత 70 సంవత్సరాలుగా ప్రభుత్వాలు, న్యాయస్థానాలు నదులను, వరద మైదానాలను కాపాడటం, రక్షించడం వంటి పనులు చేస్తున్నాయని ఆయన తెలిపారు.

నజీబ్ ఆచూకీ ఏదీ....?

న్యూఢిల్లీ : సహచర విద్యార్థులతో ఘర్షణ తలెత్తిన నేపథ్యంలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి అదృశ్యమైన విద్యార్థి నజీబ్ అహ్మద్ ఆచూకీ ఏడాదిగా తెలియరాలేదు. నగర పోలీసుల నుంచి ఈ కేసు దర్యాప్తు చేపట్టిన కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) నజీబ్ ఆచూకీని కనుగొనలేకపోయింది. ఢిల్లీ హైకోర్టు నజీబ్ ఆచూకీని కనుగోనాల్సిందిగా ఢిల్లీ పోలీసులను తొలుత కోరింది. అయితే కేసులో పురోగతి కనిపించకపోవడంతో ఈ ఏడాది మే 16న కేసును సీబీఐకి బదిలీ చేసింది. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ విద్యార్థి నజీబ్(27)2016, అక్టోబర్ 15న జేఎన్‌యూకు చెందిన మహి- మండ్వీ హాస్టల్ నుంచి అదృశ్యమయ్యాడు. నజీబ్ ఆచూకీ కోసం అతని కుటుంబ సభ్యులు ఇప్పటికీ ప్రయత్నిస్తున్నారు. బీజేపీ విద్యార్థి విభాగం ఏబీవీపీకి చెందిన అనేక మంది విద్యార్థులతో నజీబ్‌కు వివాదాలు తలెత్తాయని అతని స్నేహితులు, కుటుంబ సభ్యులు తెలిపారు. నజీబ్ అదృశ్యమైన నెల రోజుల తర్వాత తల్లి ఫాతిమా కుమారుడి ఆచూకీ కనుగొనేలా పోలీసులకు ఆదేశాలివ్వాలని అభ్యర్థిస్తూ ఢిల్లీ హైకోర్టును అభ్యర్థించింది. హైకోర్టు వెంటనే కేసును అన్ని కోణాలలో పరిశీలించాల్సిందిగా ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. రెండు నెలల తర్వాత ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో పోలీసు శునకాల సహాయంతో హాస్టళ్లు, తరగతి గదులతో సహా జేఎన్‌యూ క్యాంపస్ మొత్తాన్ని శోధించాల్సిందిగా పోలీసులను కోర్టు ఆదేశించింది. అయినప్పటికీ పోలీసులు ఆధారాలను కనిపెట్టలేకపోయారు. నజీబ్ అదృశ్యం వెనుక ఉన్నట్లుగా అనుమానిస్తున్న

ఏడాదిగా కనిపెట్టలేకపోయినా సీబీఐ

తొమ్మిది మంది విద్యార్థులకు లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించాలని కూడా హైకోర్టు సూచన చేసింది. దీంతో పాలీగ్రాఫ్(లై డిటెక్టర్) పరీక్షకు హాజరుకావాల్సిందిగా ఆ తొమ్మిది విద్యార్థులకు పోలీసులు నోటీసులు పంపించారు. అయితే దానిని వారు విస్మరించి, అదే సమయంలో దర్యాప్తు సంస్థ చేపడుతున్న చర్యలను సవాల్ చేస్తూ విచారణ కోర్టును ఆశ్రయించారు.

నజీబ్ కేసు దర్యాప్తులో సీబీఐకి అక్షింతలు

నజీబ్ అహ్మద్ ఆచూకీ కనుగొనడంలో విఫలమైనందుకు ఢిల్లీ హైకోర్టు సీబీఐకి అప్పగించారు. ఇంతవరకు సీబీఐ నజీబ్ ఆచూకీ కనుగొనలేకపోయింది. నజీబ్ ఆచూకీ కనుగొనడంలో సీబీఐకి పూర్తిగా ఆసక్తి కొరవడిందని అందుకనే దార్యాప్తులో ఎటువంటి పురోగతి చూపిచడంలేదని సీబీఐకి ఢిల్లీ హైకోర్టు చివాట్ల వేసింది. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ చదువుతున్న 27 ఏళ్ల నజీబ్ గత ఏడాది అక్టోబరు 15న తేదీ నుంచి నజీబ్ కనిపించడంలేదు. 14వ తేదీ రాత్రి సంఘ్‌పరివార్ అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీకి చెందిన కొంత మంది విద్యార్థుల నజీబ్‌తో ఘర్షణకు దిగారు. నజీబ్ కనిపించకుండా పోయిన ఐదు మాసాల తరువత కేసును సీబీఐకి అప్పగించారు. న్యాయమూర్తులు జస్టిస్ జీఎస్ సిస్తాని, జస్టిస్ చంద్రశేఖర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది.

మమ్మల్ని ఎప్పుడు గుర్తిస్తారు ...?

- సమాన అవకాశాల కోసం పోరాడతాం
- ట్రాన్స్ జెండర్ ఉద్యమ కార్యకర్త గౌరీసావంత్

న్యూఢిల్లీ : 'మమ్మల్ని స్త్రీలగానో, పురుషులుగానో పిలవడానికి ఎవరూ ఇష్టపడరు. ఒక వర్గంగా మమ్మల్ని పరిగణించే కాలం ఇప్పట్లో కనిపించడం లేదు' ఇది ట్రాన్స్‌జెండర్ ఉద్యమ కార్యకర్త గౌరీ సావంత్ ఆవేదన. లింగమార్పిడి సంఘంగా గుర్తింపు పొందడానికి ఇంకా సుదీర్ఘ మార్గం ఉందని ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఇక్కడ హిజ్రా హబ్బా(లింగమార్పిడి సమ్మేళనం) కార్యక్రమంలో లింగమార్పిడి ద్వారా తల్లి అయిన ఈ 37 గౌరీ సావంత్ మాట్లాడుతూ 'ప్రజలు మమ్మల్ని గుర్తించాలనుకుంటే, హిజ్రాలుగా గుర్తించాలి' అని పేర్కొన్నారు. భారత్‌లో హిజ్రాల సామాజిక హక్కుల కోసం పని చేస్తున్న ఇండియా హెచ్ఐవీ/ ఎయిడ్స్ అలయెన్స్, ద్వారా ఈ కార్యక్రమం ఏర్పాటయ్యింది. హిజ్రా కార్యకర్తలు గౌరీ, లక్ష్మీనారాయణ్ త్రిపాఠిలు పిటీషన్ దాఖలు చేసిన తర్వాత 2014 లో ప్రసిద్ధ నల్సా తీర్పులో భారత్‌లో హిజ్రాలను థర్డ్ జెండర్‌గా సుప్రీంకోర్టు గుర్తించింది. విద్యా, ఉద్యోగాలలో లింగ మార్పిడిదారులు (హిజ్రా)లకు రిజర్వేషన్లు మంజూరు చేయబడతాయని కోర్టు పేర్కొంది. ఈ చారిత్రాత్మక తీర్పు వెలువడి మూడు సంవత్సరాలయ్యింది. అయితే ప్రజల మనస్సులు మారడానికి ఇంకా సమయం పట్టేలా ఉందని సావంత్ చెప్పారు.'ప్రజలు నన్ను తల్లిగా ఆమోదించడం ప్రారంభించనట్లయితే, కార్యాలయాలలో పని చేసేందుకు కూడా వారు ఆమోదించాలి. మరిన్ని అవకాశాలు ఇవ్వాలి' అని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కోల్‌కత్తాలోని సోనాగచికి చెందిన రెడ్‌లైట్ ఏరియాలో అమ్మేందుకు ప్రయత్నిస్తున్న గాయత్రి అనే చిన్నారని సావంత్ దత్తత తీసుకున్నారు.'మనం కూడా తల్లులు కావచ్చని ఒక ఆలపిల్లను దత్తతగా స్వీకరించాను. నేను నా న్యాయం కోసం, హక్కుల కోసం చేశాను. దానిని ప్రజలు గుర్తించగలరు' అని ఆమె పేర్కొన్నారు.'చట్టం హిజ్రాలను గుర్తించింది' అని అన్నారు. హిజ్రాల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందన్నారు. బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ హోస్ట్‌గా నిర్వహించబడుతున్న క్విజ్ షో కౌన్ బనేగా కరోర్‌పతి కార్యక్రమంలో కూడా గత నెలలో ఆమె పాల్గొంది. టెలివిజన్ షోలో పాల్గొన్న తర్వాత నా జీవితం మారింది. అది ఒక గొప్ప అవకాశమని అన్నారు.' ఈ రోజు మనం లింగ సమానత్వం కోసం మాట్లాడుతున్నాం. ఇప్పటికి మేము సమానత్వం కోసం పోరాడుతున్నాం' అని చెప్పారు. ' రాజ్యాంగం ఏ జెండర్ పట్ల వివక్ష చూపలేదు. మేము భారత ప్రజలం' అని గౌరీసావంత్ స్పష్టం చేశారు.

గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్...

భారత్‌లో అత్యంత నమ్మకమైన బ్రాండ్లు!

బిజినెస్

- తర్వాతి స్థానాల్లో మారుతీ సుజుకీ, ఆపిల్
- ప్రపంచంలో అమెజాన్ బ్రాండ్ అత్యంత నమ్మకమైనది
- కోన్ అండ్ వోల్ఫీ సర్వేలో వెల్లడి

దేశంలో అత్యంత నమ్మకమైన బ్రాండ్‌గా సెర్చింజన్ దిగ్గజం గూగుల్ నిలిచింది. దాని తర్వాతి స్థానాల్లో మైక్రోసాఫ్ట్, అమెజాన్, మారుతీ సుజుకీ, ఆపిల్ సంస్థలు నిలిచాయి. న్యూయార్క్‌కి చెందిన గ్లోబల్ కమ్యూనికేషన్స్ సంస్థ కోన్ అండ్ వోల్ఫీ నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు తెలిశాయి. ఇంకా సోనీ, యూట్యూబ్, బీఎండబ్ల్యూ, మెర్సెడెజ్ బెంజ్, బ్రిటిష్ ఎయిర్‌వేస్ బ్రాండ్లు టాప్ 10లో నిలిచాయి. బ్రాండ్ నమ్మకం మీదే భారతీయ వినియోగదారులు ఎక్కువగా ఆధారపడుతున్నారని కోన్ అండ్ వోల్ఫీ నివేదిక పేర్కొంది. 67 శాతం మంది భారతీయ వినియోగదారులు బ్రాండ్ పేరు చూసే కొనడానికి మొగ్గుచూపుతున్నారని ఈ సర్వే వెల్లడించింది. అలాగే సంస్థలు చాలా నిజాయితీగా ఉంటే బ్రాండ్ ప్రాచుర్యం పొందుతుందని 37 శాతం మంది చెప్పినట్లు పేర్కొంది. అలాగే సేవలకు సంబంధించిన విషయంలో బ్రాండ్ల కంపెనీలదే పూర్తి బాధ్యత ఉంటుందని 38 శాతం మంది వెల్లడించినట్లు తెలిపింది. వినియోగదారుడికి ఎల్లప్పుడూ సేవలందించే బ్రాండ్లను భారతీయులు ఎక్కువగా ఆదరించారని పేర్కొంది.ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ అత్యంత నమ్మకమైన బ్రాండ్‌గా పేరు సంపాదించుకున్నట్లు రిపోర్టు తెలిపింది. తర్వాతి స్థానాల్లో ఆపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్, పేపాల్ బ్రాండ్లు ఉన్నాయి. 15 దేశాల్లో రెండు నెలల పాటు 1400 బ్రాండ్ల మీద సర్వే చేసి ఈ నివేదికను రూపొందించినట్లు కోన్ అండ్ వోల్ఫీ తెలిపింది.

విద్యార్థుల మరణమృదంగం...

కౌన్సిలింగ్ ఎవరికి ?!



ఏ రాష్ట్రములో లేని విధంగా మన ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థుల్లో తల్లిదండ్రుల ప్రమేయం చాలా ఎక్కువ. అంతే కాదు దానికి తగినట్లు కార్పోరేట్ స్థాయిలో మా విద్యాసంస్థలకు, మించిన సంస్థలు మరొకటి లేదనే విధంగా వివిధ రకాల కోర్సుల పేర్లుతో ఎంతో డబ్బును దండుకుంటూ ప్రభుత్వం అండదండతో నడుస్తున్న విద్యా సంస్థలు కోకొల్లలు. పిల్లల మానసిక వికాసం కలుగక ముందే తమ తల్లిదండ్రులు లక్షలకు లక్షలు కట్టి, తమ పిల్లలను ఈ స్థాయి విద్యను అందించడానికి ఆరో తరగతి నుంచే హాస్టల్లో ఉంచి మరీ చదివించే ప్రయత్నం చేస్తున్నారు. తాము తమ జీవితంలో పొందని స్థాయిని తమ పిల్లల ద్వారా సాధించుకోవాలనేది కొందరి తపనైతే, మరికొందరు తమ బంధువుల పిల్లలనో లేదా సమాజంలో వేరొక పిల్లవాడినో ఆదర్శంగా తీసుకుని వారి పిల్లలు కూడా తమ జీవితంలో అంత ఎత్తు ఎదగాలని కోరుకొనేవారు ఈ విద్యా విధానం పై ఆకర్షితులవుతున్నారు. ఈ తరుణంలో తల్లిదండ్రులు ఇది ఒకటే తమ పిల్లల పట్ల చూపించ వలసిన బాధ్యతగా బావిస్తూ తమ పిల్లలను ఇలాంటి హాస్టల్ వ్యవస్థకు అప్పచెబుతున్నారు. ముఖ్యంగా కౌమార దశలో తల్లిదండ్రుల ఆవశ్యకత పిల్లలపై ఎంతో ఉంటుంది. అంతే కాకుండా తమ పిల్లల యొక్క సామర్థ్యాన్ని గుర్తించక ర్యాంకుల సాధనలో తక్కువ స్థాయిలో ఉంటే ఆ విద్యవ్యవస్థల్లో పని చేసే ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం తద్వారా పిల్లలపై కూడా దాని ప్రభావం కనబడటం మనకు తెలిసిన విషయమే. దీనికి తోడు ఈ కౌమార దశలో హార్మోనుల ప్రభావం పిల్లలపై కచ్చితంగా ఉంటుంది. అంతేకాకుండా ప్రతి రోజు 15 నుండి 18 గంటల వరకు విద్యార్థులు సరైన, నిద్రలేక, వ్యాయామం లేక తల్లి దండ్రుల ఓదార్పు, ప్రేమలకు దూరంగా ఉంటూ ఎంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీనిని బట్టి తప్పు ఎవరిదని ప్రశ్నించుకుంటే, విద్యార్థులదా, ఉపాధ్యాయులదా,తల్లిదండ్రులదా, ఈ సమాజానిదా లేదా ప్రభుత్వ విధాన లోపమా అనేది గ్రహించవలిసిన విషయం. అయితే లోపము ఒకరిది అని లోపము మరోకరిదని నిందించే దానికంటే ఈ వ్యవస్థలో ఎలాంటి మార్పు అవసరం, ఎవరికి కౌన్సిలింగ్ ఇవ్వాలని అనే విషయాన్ని గ్రహించాలి. దీని ద్వారా మన విద్యార్థులైన భావితర ప్రాణాలను,భవిష్యత్తును కాపాడుకోగలం. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు తమ మనుగడ సాధించాలంటే నిధులు అవసరం. కాబట్టి ఇలాంటి కార్పోరేట్ వ్యవస్థలపై కొంతవరకు వీరు ఆధారపడి ఉన్నారు. అంతేకాదు ఈ కార్పోరేట్ సంస్థలు కూడా సకల సౌకర్యాలతో కూడిన హాస్టలు వసతులతో కూడిన మంచి నాణ్యమైన విద్యను అందించాలంటే ఆ మాత్రం ఫీజుల రూపంలో వసూలు చేయక తప్పదు. ఇంత ఫీజులు కట్టి చదివించినా చదవని పిల్లల తప్పు అని మనం విద్యార్థులపై నిందమోపి వారిపై ఒత్తిడిని పెంచలేము. మానసిక పరిమితి ఏ సబ్జెక్టులో ఏ స్థాయిలో ఉందో గ్రహించి వారికి ఆ వైపు వారిని ప్రోత్సహించవలసిన బాధ్యత అటు తల్లి దండ్రులపై, ఇటు ఉపాధ్యాయులపై ఎంతైనా ఉంది. ఇంత కంటే ఎక్కువ బాధ్యత అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలకూ ఉంది. ప్రభుత్వాలు ఒక నిధులను సేకరించి వాటిని ఎలా ఖర్చు పెట్టాలనే వాటిపై మాత్రమే దృష్టి సారించటం మాని ఇతర ముఖ్యమైన సంస్కరణలపై ప్రయత్నించవలసిన బాధ్యత ఎంతైనా ఉంది. ఈ విద్యా వ్యవస్థలో ప్రతి సబ్జెక్టు కూ ప్రత్యేక విలువ ఉన్న విషయాన్ని గుర్తించాలి. అంతేకాకుండా తల్లిదండ్రులలో ఒక్క (ఐఐటీ, జె.ఈ.ఈ, ఎ.ఐ.ఐ.ఎం.ఎస్, నీట్) వంటి కోర్సులలో మాత్రమే ఎంతో విలువ ఉన్నట్లు భావిస్తున్న తరుణంలో వారిని ఈ అపోహ నుంచి బయటకు వచ్చే విధంగా అన్ని సెక్టార్‌ల (అన్ని రంగాల్లో) నూ అభివృద్ధికి, మంచి ఉద్యోగ అవకాశాలు, మంచి స్టేటస్ ఉన్నట్లు భరోసా కలిగించాలి. అన్ని రంగాల్లోనూ ప్రజలలో మంచి అవగాహన కలిగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలి. ఇటీవల కాలంలో హెల్మెట్ వాడకంపై, యాక్సిడెంట్స్‌లను తగ్గించటం గురించి పోలీసు వ్యవస్థ ప్రజలలో చైతన్యాన్ని కలిగిస్తూ ఉన్నారు. అదే విధంగా పోలీసు వ్యవస్థ కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలి. విద్యార్థుల సో కాల్డ్ నాయకులు, ఉపాధ్యాయ, రాజకీయ నాయకులు కూడా ఈ విషయాలలో తమ వంతు పాత్రను పోషించి తాము కోరుకునే సమాజసేవలో పాత్రదారులు కావచ్చు. దీని వలన తల్లిదండ్రులు తమ పిల్లలను ఒక్క కోర్సు వైపు మాత్రమే ఆకర్షితులవకుండా ఆయా కోర్సుల్లో కాంపిటేషన్‌ను తగ్గించి పిల్లలపై ఒత్తిడిని పూర్తిగా తగ్గించవచ్చు. దీని ద్వారా విద్యార్థుల మరణాలను తగ్గించి మన భావి యువ భారతాన్ని కాపాడుకోవచ్చు.

– డా. చాంద్‌బాషా

దేశం మారనున్న శ్రీశాంత్?

క్రీడలు

న్యూఢిల్లీ : ఐపీఎల్-2013 స్పాట్ ఫిక్సింగ్ ఉదంతంలో నిందితుడైన క్రికెటర్ శ్రీశాంత్ వేరే దేశం తరపున క్రికెట్ ఆడే యోచనలో ఉన్నాడు. కొన్నేళ్ళుగా శ్రీశాంత్‌పై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) వ్యవహరిస్తున్న వైఖరికి తీవ్ర మనస్తాపం చెందిన అతను ఇక టీమిండియాకు ఆడే అవకాశం లేకపోవచ్చునే అభిప్రాయానికి వచ్చాడు. దీనిలో భాగంగా తాను వేరే దేశానికి ప్రాతినిధ్యం వహించాలనుకున్నట్లు ప్రముఖ వార్తా సంస్థ ఆసియా నెట్ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశాడు. ఒకవేళ బీసీసీఐ తనపై నిషేధాన్ని కొనసాగిస్తే మాత్రం తనదారి తాను చూసుకుంటాననే హెచ్చరికలు జారీ చేశాడు. 'నన్ను బీసీసీఐ నిషేధించింది. అంతేకానీ ఐసీసీకాదు. అంటే నేను భారత్ మాత్రం ఆడకూడదు. వేరే దేశానికి క్రికెట్ ఆడొచ్చు కదా. నా వయసు ఇంకా 34 ఏళ్లే నా కెరీర్ చాలా ఉంది. ఇంకా ఆరేళ్లుగా పైగా క్రికెట్ ఆడే సత్తా ఉంది. ఒక వ్యక్తిగా క్రికెట్ అంటే ఇష్టం అందుచేత క్రికెట్‌నే ఆడాలనుకుంటున్న. బీసీసీఐ అనేది ఒక ప్రైవేట్ సంస్థ అలానే వేరే దేశానికి క్రికెట్ ఆడతా. నాపై నిషేధం కొనసాగించే నిర్ణయం బీసీసీఐకే వదిలేశా. ఇక్కడ కేరళ రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం వేరు 'అని దుబాయ్‌లో జరిగిన ఒక పబ్లిక్ ఈవెంట్‌కు హాజరైన సందర్భంలో శ్రీశాంత్ స్పష్టం చేశాడు. కొన్ని రోజులు క్రితం స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడిన పేస్ బౌలర్ శ్రీశాంత్‌పై బీసీసీఐ విధించిన నిషేధం కొనసాగుతుందని జస్టిస్ నవనీతి ప్రసాద్ సింగ్ జస్టిస్ రాజా విజయరాఘవన్‌లతో కూడిన కేరళ హైకోర్టు స్పష్టం చేసింది.

బాలయ్య 'ఎన్టీఆర్ బయోపిక్'పై

పాజిటివ్ న్యూస్!

నట దిగ్గజం, లెజెండ్, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడైన 'ఎన్టీఆర్ బయోపిక్' గురించి గత నెల రోజులుగా టాలీవుడ్‌లో జరుగుతున్న సెన్సేషన్ ఏమిటో అందరికీ తెలుసు. ఈ బయోపిక్ విషయంలోకి వివాదాల దర్శకుడు వర్మ ఎంటరవడంతో, ఈ బయోపిక్ వ్యవహారం యమా రంజుగా తయారైంది. ఇటు వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' అంటుంటే, అటు బాలయ్య కూడా తన తండ్రి బయోపిక్ చిత్రానికి సంబంధించిన పనులను వేగవంతం చేసే ప్రయత్నం చేస్తున్నారు.

ఇక వర్మ చేయాలనుకుంటున్న 'లక్ష్మీస్ ఎన్టీఆర్' విషయాలను ఎప్పటికప్పుడు వర్మ ఛెబుతున్నాడు కానీ, బాలయ్య చేయాలనుకుంటున్న బయోపిక్ విషయంలోనే ఎటువంటి విషయాలు బయటికి రావడం లేదు. ఇప్పటి వరకు తేజ డైరెక్ట్ చేస్తాడనే న్యూస్ మినహా ఈ చిత్రంపై ఎటువంటి సమాచారం తెలియడం లేదు. అయితే తాజాగా ఈ బయోపిక్ గురించి ఓ వార్త టాలీవుడ్ సర్కిల్స్‌లో హల్‌చల్ చేస్తోంది.

బాలకృష్ణ చేయాలనుకుంటున్న 'ఎన్టీఆర్ బయోపిక్'కి మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎమ్.ఎమ్. కీరవాణి సెలక్ట్ అయ్యారంట. బాహుబలి రెండు పార్ట్‌లకు అద్భుతమైన సంగీతాన్ని అందించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారనే వార్త సోషల్ మీడియాలో కూడా చక్కర్లు కొడుతోంది. మరి ఈ వార్త నిజమైతే, సంగీతం పరంగా ఈ సినిమాకి తిరుగులేదనే చెప్పుకోవచ్చు. ఈ పాజిటివ్ వార్తతో నందమూరి అభిమానులు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నట్లుగా టాక్.

సీతాఫలంతో ఆరోగ్యం పదిలం..

అధికంగా లభించే మదుర ఫలాల్లో సీతాఫలం ఒకటి. ఇది సీతాకాలంలోనే కాకుండా ప్రస్తుత కాలంలో కూడా విరివిగా లభిస్తున్నాయి. ఈ సీతాఫలాన్ని పలురకాల పేర్లతో పిలుస్తుంటారు. అమృతఫలాన్ని తలపించే ఈ సీతాఫలాన్ని స్వీట్‌యాపిల్ అని, షుగర్‌యాపిల్, కస్టర్డ్ యాపిల్, షరీఫా అని రకరాల పేర్లతో పిలుస్తుంటారు. ఇది దక్షిణ అమెరికా దేశాలతో పాటు మనదేశంలోనూ అధికంగా పండుతుంది. దీనిని పండుగా తినటంతో పాటు స్వీట్లు, జెల్లి, ఐస్‌క్రీమ్, జామ్‌లు తయారు చేస్తుంటారు. మనకి ఇది సీతాఫలం పండుగా సుపరిచితమైన ఈ పండు చత్తీస్‌గాఢ్ వాసులకు మాత్రం అద్భుత ఔషదీఫలం. అక్కడ దీని ఆకులు, బెరడు, వేరు, ఇలా అన్నీ భాగాలకు పలు వ్యాధుల నివారణకు వినియోగిస్తారు. శరీర పనితీరు చురుకుగా ఉండటానికి అతి ప్రధానమైనది మెగ్నిషీయం. అదికూడా ఈ పండుద్వారా లభిస్తుంది. 100 గ్రాముల సీతాఫలం గుజ్జు రోజూ తీసుకోవటం వల్ల దాదాపు 10 శాతం మెగ్నిషీయం అందుతుంది. కండరాలకు విశ్రాంతి ఇవ్వటంలో, గుండెజబ్బుల బారినుంచి శరీరాన్ని కాపాడంలో ఈ మెగ్నిషీయం కీలకపాత్ర పోషిస్తుంది. సీతాఫలం తేలికగా జీర్ణమయ్యే పండు. అందువల్లే దీనిని అన్ని వయసుల వారు నిర్భయంగా స్వీకరించవచ్చునంటున్నారు. అంతేకాక పసిపిల్లలు తీసుకునే ఆహారంలోనే ఈ గుజ్జును చేర్చి తినిపిస్తే మరింత బలం ఉంటుంది.

దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు...

జ్వరంగా ఉండి నాలుక పిడసకట్టి దాహంగా ఉన్నప్పుడు సీతాఫలం గుజ్జు, పాలు కలిపిన మిశ్రమాన్ని ఇస్తే దాహం తగ్గిపోతుంది. సీతాఫలం గింజలు స్త్రీలలో రుతుస్రావాన్ని తగ్గిస్తుంది. కాబట్టి గర్భిణీలు ఈ పండు తినకూడదు.సీతాఫలం ఆకులరసం తీసి పుండ్లపై రాస్తే పుండ్లు మానిపోతాయి. ఆకు పసరు రాయటంవల్ల పళ్లచిగుళ్ల, పిప్పిపన్ను నొప్పి తగ్గుతుంది. గింజల పొడిని కొబ్బరినూనెలో కలిపి తలకు రాస్తే పేలు నసిస్తాయి. మన ప్రాంతాల్లో వర్షాకాలంలో విస్తారంగా లభించే ఈ పండ్లు మిక్కిలి తీపికలిగి చలువచేసే గుణం కలిగి ఉంటుంది. మాంస దాతువులను కూడా పెంచుతుంది. మూత్రంలో మంటను తగ్గిస్తుంది. మూత్రాశయ రోగాలను తగ్గించే మూత్రాన్ని జారీచేస్తుంది. ఇన్ని గుణాలున్న సీతాఫలాన్ని అందుబాటులో ఉన్నంతవరకూ రోజూతింటే ఎంతో మేలు చేకూరుతుంది.

పోషకాలు : 100 గ్రాముల సీతాఫలంలో... శక్తి : 101 కిలో క్యాలరీలు, మాంస కృత్తులు : 17 గ్రాములు, కొవ్వు : 0.6 గ్రాములు, కార్పోహైడ్రేట్‌లు : 25.2 గ్రాములు, ముడిపీసు : 3 గ్రాములు, క్యాల్షియం : 17 మిల్లీగ్రాములు, పాస్పరస్ : 47 మిల్లీ గ్రాములు, పొటాషియం : 382 మిల్లీ గ్రాములు లభిస్తాయి.

చౌక డిపోలకు కార్పొరేట్ లుక్

- త్వరలో 'అన్న విలేజ్ మాల్స్'
- రిలయెన్స్, ఫ్యూచర్ గ్రూపుల భాగస్వామ్యంతో ఏర్పాటు
- జనవరి నుంచి 50 శాతం సబ్సిడీపై అరకిలో పంచదార
- పౌరసరఫరాల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



రాజధాని వార్తలు ప్రతినిధి, అమరావతి : త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 'విలేజ్ మాల్స్' ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. మొత్తం 29 వేల చౌకధరల దుకాణాలను దశల వారీగా విలేజ్ మాల్స్‌గా మార్చాలని అధికారులను ఆదేశించారు. తక్కువ ధరకు, నాణ్యమైన నిత్యావసర వస్తువులను వినియోగదారులకు అందించడమే లక్ష్యం కావాలని సూచించారు. సచివాలయంలో జరిగిన పౌరసరఫరాల శాఖ సమీక్ష సమావేశంలో 'అన్న విలేజ్ మాల్' పేరుతో తొలివిడతగా 6,500 దుకాణాల ఏర్పాటుకు సీఎం పచ్చజెండా. రిలయన్స్, ఫ్యూచర్ గ్రూపుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ దుకాణాలను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు, ప్రత్యేకంగా లోగో రూపొందించాలని చెప్పారు. కనీసం 200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటుచేసే ఈ మాల్స్‌కి మొత్తం వ్యయంలో 25 శాతం ప్రభుత్వం భరించమే కాకుండా, మరో 25 శాతం ముద్ర రుణాన్ని డీలరుకు ఇప్పించనుంది. ఈ మాల్‌లో డ్వాక్రా, మెప్మా, జీసీసీ ఉత్పత్తులతో పాటు ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసే వివిధ వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులో వుంచనుంది. బందరు లడ్డు, కాకినాడ కాజా, తెలుగింటి పచ్చళ్లలో వంటివి కూడా వీటిలో లభిస్తాయి. ఎవరైనా సరే తమ ఉత్పత్తులను 'అన్న విలేజ్ మాల్'లో విక్రయించుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. ఇక 'రేషన్ బియ్యం' తమకు వద్దు అనుకునే తెల్లకార్డుదారులకు అంతేవిలువైన నగదును 'అన్న విలేజ్ మాల్'లో కావాల్సిన ఆహార పదార్థాలు కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. ఖాళీగా వున్న 4,599 చౌకధరల దుకాణాలకు డీలర్లను వెంటనే నియమించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రేషన్ సరుకుల పంపిణీలో లబ్దిదారులకు సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎత్తివేసినా తెల్ల రేషన్ కార్డుదారులకు మార్కెట్ ధర కన్నా 50 శాతం తక్కువకు నెలకు అర కిలో రేషన్‌లో పంచదారను జత చేయాలన్నారు. అలాగే ప్రత్యేక అవసరాలు వున్న కురాకుల, రజక, మత్స్యకార తదితర సామాజికవర్గాల వారికి వైబ్ కిరోసిన్ ఇవ్వాలని, కొత్తగా రేషన్ కార్డులు మంజూరులో బోగస్ జారీ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు చెప్పారు.

పెనుగొండ లక్ష్మీనారాయణకు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం

రాజధాని వార్తలు ప్రతినిధి, గుంటూరు : తెలుగు విశ్వవిద్యాలయం 2015 వ సంవత్సరానికిగానూ అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణకు సాహిత్య విమర్శ విభాగంలో సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది. పెనుగొండ లక్ష్మీనారాయణ రచించిన విధిత పుస్తకానికి ఈ పురస్కారం లభించింది. లక్ష్మీనారాయణ అభ్యుదయ రచయితల సంఘానికి 1974వ సంవత్సరం నుంచి వివిధ హోదాలలో సేవలందిస్తున్నారు. గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం చెరువు కొమ్ముపాలెంలో జన్మించిన ఈయన న్యాయవాద వృత్తిలో ఉన్నారు. గుంటూరు బార్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగానూ పనిచేశారు. 40 పుస్తకాలకు పైగా సంపాదకత్వం వహించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలలో జరిగిన సెమినార్లలో పరిశోధన పత్రాలను సమర్పించారు. ఆయన రాసిన విమర్శనాత్మక వ్యాసాలు 250 దాకా పలు పత్రికల్లో అచ్చు అయ్యాయి. రేపటిలోకి అనే కవిత సంకలనాన్ని నూరేళ్ల పులుపుల పేరున పులుపుల వెంకటశివయ్య సంపూర్ణ జీవిత చరిత్రను రాశారు. ఈ సందర్భంగా పలు సాహితీ సంస్థలు, సాహితీవేత్తలు పెనుగొండ లక్ష్మీనారాయణకు అభినందనలు తెలిపారు.

సామాన్య కిరణ్‌కు తెలుగు వర్సిటీ అవార్డు

ప్రముఖ రచయిత్రి ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమాన్యయకర్త సామాన్యకిరణ్‌కు శ్రీ పాట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఉత్తమ రచయిత అవార్డు ప్రకటించింది. 2012లో ప్రచురించిన 'కొత్తగూడెం పురస్కారాన్ని లవ్ లెటర్' కథానికకు 2015 సాహితీ పురస్కారాన్ని తెలుగు యూనివర్సిటీ అందజేయనుంది.

కాల్ మనీ వ్యాపారుల దౌర్జన్యం

- వడ్డీ వ్యాపారుల చేతుల్లో విలవిల్లాడుతున్న ఉద్యోగులు
- రూ.10 నుంచి 20 వరకు వడ్డీ
- న్యాయవాదుల కనుసన్నల్లో కార్యకలాపాలు

రాజధాని వార్తలు ప్రతినిధి, నెల్లూరు : ఇటీవల విజయవాడలో జరిగిన కాల్‌మనీ కుంభకోణం ఆంధ్ర రాష్ట్రాన్ని ఓ కుదుపు కుదిపింది. అలాగే ఓ వడ్డీ వ్యాపారస్తుడు నెల్లూరు నగర నడి బొడ్డున తిష్ట వేసుకుని కూర్చున్నాడు. అతడి ధాటికి ఎంతో మంది, అమాయక ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రభావితమై నరకయాతన అనుభవిస్తున్నారు. వీరు విషయాన్ని చెప్పుకోలేక సతమతమవుతున్నారు. దీనికి మూలకారణమైన వడ్డీ వ్యాపారి వివరాల్లోకి తొంగి చూస్తే అతడు ఎలాగా వ్యవహారాలను సొంత లాభం కోసం చక్కబెట్టుకుంటున్నాడో తెలుస్తోంది. నెల్లూరు జిల్లాలోని 'కలువాయి' నుంచి వలస వచ్చిన ఓ వ్యక్తి నగరంలోని ' బార కాసు' స్టేట్ బ్యాంక్ ఎదురుగా వడ్డీ వ్యాపారాన్ని తిప్పుతున్నాడు. అతనికి అండగా కొంత మంది న్యాయవాదులు ఉన్నారని తెలిసింది. డబ్బు అత్యవసరమున్న ఉద్యోగులను, చిరువ్యాపారస్తులను గుర్తించి వారికి ఏదో విధంగా ఎరవేసి డబ్బులు రుణంగా ఇస్తున్నాడు. ఇచ్చిన మొత్తానికి దొంగ లెక్కలతో పది నుండి పదిహేను రెట్లు ఎక్కువ వసూలు చేయటంలో ఆయను ఆయనే సాటి. ఇతని ధాటికి పలువురు వైద్యులు, ప్రభుత్వ కళాశాల ఉద్యోగులు, చిరువ్యాపారులు, బ్యాంకు ఉద్యోగులు సైతం అల్లాడుతున్నారు. డబ్బులు ఇచ్చేటపుడే స్థిరాస్తికి సంబంధించిన పత్రాలను తీసుకోవటం, ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకాలు తీసుకోవటం, చెక్కులపై సంతకాలు తీసుకోవటంలో అతను సిద్ధహస్తుడు. అంతేకాకుండా తప్పులెక్కలతో ఎక్కువ మొత్తం చెప్పటం, డబ్బులు కట్టలేని వారిదగ్గర నుంచి ఖాళీ ప్రామిసరీ నోట్లపై తమకు స్థలాలు అమ్మివేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించటం వంటి అరాచక పనులు చేయటం అతనికి పరిపాటి. కొన్నిచోట్లయితే స్థలాల ఆక్రమణకు పాల్పడుతున్నాడు. అంతేకాక తన దగ్గరకు డబ్బుకోసం వచ్చిన వారి దగ్గర నుంచి ఏటిఎం కార్డులు స్వాధీనపరచుకుని వారి జీతాలు పడిన వెంటనే కట్టాల్సిన దానికన్నా ఎక్కువ విత్‌డ్రా చేసుకోవటం, అదేమంటే చెక్ బౌన్స్ కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పటంలో అతను నైపుణ్యుడు. తన వద్దకు డబ్బుకోసం వచ్చిన మహిళా ఉద్యోగులను కూడా అవమానిస్తారని డబ్బు కట్టలేకపోతే పని చేసుకుని సంపాదించి కట్టమని అవమానకరంగా మాట్లాడతాడని బాధితులు తెలుపుతున్నారు. ఎవరైనా గట్టిగా అడిగేందుకు వెళ్లితే అతని కార్యాలయంలో ఉండే ముగ్గురు న్యాయవాదులు మరింత బెదిరిస్తారని తెలిపారు. ఈ ముగ్గురు న్యాయవాదుల్లో ఒకరికి అర్హత లేక పోయినా నగరపాలక సంస్థలో న్యాయసలహా దారులుగా నియమించుకున్నారని బాధితులు తెలిపారు. నగరంలోని పలువురు ప్రజాప్రతినిధులతో తమకు సంబంధం ఉందని చెప్పడంతో బాధితులు భయపడుతున్నారు. గతంలో విజయవాడ కాల్‌మనీ కుంభకోణం వెలుగులోనికి వచ్చినప్పుడు అప్పటి ఎస్పీ సెంథిల్ కుమార్ ఈ వడ్డీ రాక్షసుడిని అదుపులోనికి తీసుకున్నారని 20 రోజుల తర్వాత ముగ్గురు న్యాయవాదులు, అధికార పార్టీ నాయకుల సహాయంతో బయటకు వచ్చారని తెలియజేశారు. రూ.15 లక్షలు తీసుకున్న ఒక వ్యక్తి నెలానెలా సక్రమంగా కడుతున్నా మధ్యలో ఆపినందుకు 72లక్షలు కట్టమన్నాడని అదేమంటే కేసు వేశాడని బాధితుడు వాపోయాడు. గతంలో ఈ వడ్డీ రాక్షసుడిపై కేసులు పెట్టినా కూడా న్యాయం జరగలేదని బాధితులు వాపోతున్నారు. ప్రస్తుత ఇతని బాధితులు సమేకమై జిల్లా పోలీసు యంత్రాగానికి, పై అధికారులకు ఫిర్యాదు చేయాలనుకున్నారని బాధితులు తెలిపారు. పోలీసులు ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వందల మంది ప్రజలకు ఈ వడ్డీ రాక్షసుడు కల్గిస్తున్న బాధల నుంచి తప్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు. .

మార్కెట్ లో బంగారం, వెండి ధరలు

వివిధ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర హైదరాబాదులో రూ.30,570, విజయవాడలో రూ.30,600, విశాఖపట్నంలో రూ.30,570, ప్రొద్దుటూరులో రూ.30,510, చెన్నైలో రూ.27,000గా ఉంది. ఇక 22 క్యారెట్ల ఆభరణాల బంగారం 10 గ్రాముల ధర హైదరాబాదులో రూ.28,310, విజయవాడలో రూ.28,500, విశాఖపట్నంలో రూ.28,120, ప్రొద్దుటూరులో రూ.28,290, చెన్నైలో రూ.28,290గా ఉంది. వెండి కిలో ధర హైదరాబాదులో రూ.40,000, విజయవాడలో రూ.41,000, విశాఖపట్నంలో రూ.40,700, ప్రొద్దుటూరులో రూ.41,000, చెన్నైలో రూ.42,800 వద్ద ముగిసింది.

Printed & Published by Shri Pattan Hussain Khan, on behalf of M/s Vastitute Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor Shri Pattan Hussain Khan. RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : info@rajadhanivartalu.com